

ట్యాంక్‌బండ్‌పై సోమవారం సాయంత్రం...

**జయజయహే గణనాథ**

వినాయక ఉత్సవాల్లో నిమజ్జనాల సందడి సోమవారమూ కొనసాగింది. ట్యాంక్‌బండ్‌తో పాటు పలు చెరువుల వద్ద విగ్రహాలను భక్తులు కోలాహలంగా నిమజ్జనం చేశారు.


# ఈనాడు హైదరాబాద్

HMDA

మంగళవారం 29 ఆగస్టు 2017 | 24 పేజీలు


# గుంతలు.. గుంతలు

- నగర రహదారులపై వాహన చోదకుల అవస్థలు
- శాస్త్రీయ మరమ్మతు విధానాలపై యంత్రాంగం నిర్లక్ష్యం



ఎల్‌బీ నగర్ చింతల్‌కుంట చెక్‌పోస్టు వద్ద కంకర తేలిన రహదారి

| | |
|---|---|
| 1600 | గత 3 రోజుల్లో పడ్డ గుంతలు |
| రూ.400 | ఒక్కో గుంత పూడ్చివేత వ్యయం |
| రూ.20 కోట్లు | ఏడాదికి అయ్యే మొత్తం ఖర్చు |

ఈనాడు, హైదరాబాద్

గ్రేటర్ రహదారులు మృత్యు వలయాలుగా మారుతున్నాయి. గుంతలు, మిట్టలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. గుంతల కారణంగా గతేడాది సుమారు అయిదుగురు రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. అయినా గుంతల్ని పూడ్చటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాటిని శాస్త్రీయంగా పూడ్చకపోవటంతో మరుసటి రోజుకే అక్కడ గుంత తేలుతోంది. రోడ్డుపై ఇసుక, కంకర కుప్పలు, తెప్పలుగా పేరుకుపోయి వాహన ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

నగరంలో ఏ రోజు గుంతల్ని.. అదే రోజు పూడ్చేయాలని కమిషనర్ డాక్టర్. బి.జనార్దన్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్ కింది స్థాయి అధికారులను, సిబ్బందిని ఆదేశిస్తున్నారు. ఆదేశాలు మామూలైతే.. ఉల్లంఘనలు షరామామూలు అనేలా కిందిస్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్నారు. గుంతల్ని శాస్త్రీయంగా పూడ్చాలని శిక్షణ ...మిగతా 4లో


ఈనాడు, హైదరాబాద్

**ఈ వర్షాకాలంలోనూ నాలాల పరివాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే.. నాలాల విస్తరణ పనులు ఆగిపోవడమే అందుకు కారణం. నిర్వాసితులకు, నిర్మాణాలు కోల్పోయే వారికి పరిహారం ఎలా చెల్లించాలనే అంశంపై అధికారుల్లో సందిగ్ధత ఏర్పడింది. స్పష్టత కోసం సర్కారుకు లేఖ రాశామని చెబుతున్నారు. కానీ స్థానిక నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే ఉన్నతాధికారులు కూల్చివేత పనులను నిలిపేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



# 'వరద' కష్టాలు కొనసాగుతాయి!

- రెండు రోజుల్లోనే ఆగిన నాలాల విస్తరణ
- స్థానిక నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడే కారణం
- పరిహారంపై స్పష్టత లేక అంటున్న బల్దియా



హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాలతో అనేక పాఠాలు నేర్చుకుంది. రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులతోపాటు నాలాల సమగ్ర సర్వేకు కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని చెరువులు, నాలాలతో కూడిన పాతకాలం నాటి నగర మ్యాప్‌లతో బల్దియా సర్వే చేపట్టింది. సుమారు పది నెలల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించిన యంత్రాంగం పలు అక్రమ కట్టడాలను గుర్తించింది. వాటిని కూల్చేస్తామని ప్రకటించారు. ఇంతలో వర్షాకాలం సమీపించింది. వెంటనే అన్నింటినీ కూల్చేయడం సాధ్యం కాదని, ముందుగా ప్రవాహానికి ఎక్కువగా ఆటంకం కలిగించే 16.6కి.మీల పరిధిలోని 1,002 నిర్మాణాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం నిర్ణయించింది. ఆ ప్రకారం ఇంజినీరింగ్ విభాగం నివేదిక సిద్ధం చేసింది. యజమానులకు నష్టపరిహారం చెల్లించి కూల్చివేత, విస్తరణ పనులు పూర్తిచేస్తామని జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ఈ పనుల కోసం రూ.230 కోట్లు ఖర్చు చేసేందుకు సర్కారు అంగీకారం తెలపడం, అనంతరం మూసాపేట సర్కిల్‌లో ప్రారంభమవడం వెంటవెంటనే జరిగాయి. తరువాత రెండు రోజుల్లోనే ఆగిపోవడం గమనార్హం.

## పరిహారం కష్టమంటున్న బల్దియా

యుద్ధప్రాతిపదికన కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో నాలాలపై ఉన్న 700 నిర్మాణాలను కూల్చేస్తామని బల్దియా జూన్‌లో ప్రకటించింది. అంతటి ప్రతిష్ఠాత్మక పనులను ప్రారంభించిన రెండు రోజులకే అధికారులు నిలిపేశారు. ఇదేంటని అడిగితే యజమానులకు పరిహారం ఎలా చెల్లించాలనే అంశంపై సందిగ్ధతే కారణమని చెబుతున్నారు. "పరిహారం ఎలా చెల్లించాలనే అంశంపై సర్కారు నుంచి స్పష్టత రావాలి. ప్రభుత్వ నిర్మాణాలను కూల్చాల్సి వస్తే.. భూసేకరణకు డబ్బు ...మిగతా 4లో

| నాలాల సర్వే కథ | 10 నెలలు | 173 | 160 | 12,432 | రూ.230 కోట్లు |
|---|---|---|---|---|---|
| | పట్టిన సమయం | మొత్తం గుర్తించినవి | సర్వే చేసిన నాలాలు | ప్రవాహానికి అడ్డుగా ఉన్న కట్టడాలు | తొలి దశ పనులకు ప్రభుత్వ కేటాయింపు |

# నైజీరియన్ల మాయాజాలం!

- రూ.4.5 కోట్లు ఎరవేశారు.. రూ.22 లక్షలు కాజేశారు



గౌజా ఆరిస్టైడ్ | ఒమెకే తోచుక్వు | ఒక్వెరీ తోచుక్వు | ఆనంద్ నాగేశియా

రాయదుర్గం, న్యూస్‌టుడే: నైజీరియన్ మోసగాళ్లు శ్యాంసంగ్ లాటరీ పేరుతో రూ.4.5 కోట్లు ఎరవేసి ఓ వ్యక్తి నుంచి రూ.22లక్షలు కాజేశారు. రూ.500 మాత్రమే బ్యాలెన్స్ ఉన్న నకిలీ ఆర్‌బీఐ ఏటీఎం కార్డు పంపించి బాధితుడిని నమ్మించి మరీ దండుకున్నారు. కేసులో ముగ్గురు నైజీరియన్‌లతోపాటు పశ్చిమ బంగకు చెందిన మరో వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైం ...మిగతా 4లో




# రైళ్లపై రాళ్ల వర్షం!

న్యూస్‌టుడే, కాచిగూడ

పాతబస్తీ మీదుగా వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్‌, ప్యాసింజర్‌, ఎంఎంటీఎస్‌ రైళ్లపై జరుగుతున్న రాళ్ల దాడులు ఆందోళన కల్గిస్తున్నాయి. ఈ రాళ్ల దాడుల్లో ప్రయాణికులు తీవ్రంగా గాయపడుతున్నారు. దాడుల నిరోధానికి కాచిగూడ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), రైల్వే పరిరక్షక దళం (ఆర్పీఎఫ్‌) బలగాలు ఆయా ప్రాంతాల శాంతిభద్రతల పోలీసులతో కలిసి కొద్ది రోజుల క్రితం స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టారు. దాడులు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించిన పోలీసులు అక్కడ తల్లిదండ్రులు, యువతకు అవగాహన కల్పిస్తున్నారు. రైలు పట్టాల పక్కన ఉండే బస్తీలలో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైళ్లపై రాళ్లు రువ్వొద్దని, తద్వారా ప్రయాణికులు గాయపడుతున్నారని వివరిస్తున్నారు. మరో పక్క దాడులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరిస్తున్నారు. స్పెషల్‌ డ్రైవ్‌ వచ్చే నెలలో కూడా కొనసాగుతుందని రైల్వే పోలీస్‌ అధికారులు తెలిపారు.

### సమస్యాత్మక స్టేషన్లు..

కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ (జీఆర్‌పీ), కాచిగూడ రైల్వే పరిరక్షక దళం (ఆర్‌పీఎఫ్‌) పరిధిలోని పాతబస్తీలోని యాకుత్‌పుర, డబీర్‌పుర, ఉప్పుగూడ, ఫలక్‌నుమా, బుద్వేల్‌, ఉందానగర్‌ స్టేషన్ల మధ్య రైళ్లపై రాళ్ల దాడులు జరుగుతున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. ఆయా బస్తీలు, మురికివాడల్లోని 8 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సున్న వారు గుంపులు, గుంపులుగా ఏర్పడి రైళ్లపై రాళ్ల దాడులకు పాల్పడుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఎప్పుడు దాడి జరుగుతుందోనని రైళ్లలో రాకపోకలు సాగించేవారు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా తరచూ రైళ్లపై రాళ్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే చెన్నై ఎగ్మోర్‌, బెంగళూర్‌, వెంకటాద్రి, యశ్వంత్‌పూర్‌, మధురై, మంగళూర్‌, ఏపీ, కర్ణాటక సంపర్క్‌ క్రాంతి, కొంగు, వైనగంగ తదితర ఎక్స్‌ప్రెస్‌, మహబూబ్‌నగర్‌, కర్నూల్‌, గుంతకల్లు తదితర ప్యాసింజర్‌, ఎంఎంటీఎస్‌ రైళ్లలోని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

### ముంబయిలోనూ...

రైళ్లపై దాడులు కేవలం మన నగరంలోని పాతబస్తీకే పరిమితం కాలేదు. పశ్చిమ రైల్వే ముంబయిలోని మహిం-బాంద్రా, శాంతాక్రుజ్‌, బోరివలి, దహిసర్‌, మధ్య రైల్వేలోని వితల్‌వాడి-ఉల్లాస్‌నగర్‌, పార్సిక్‌హిల్‌, మసీదు బుందర్‌, బుకుల్లా, మాతుంగ, థానే-కల్వా, షహద్‌-అంబివలి తదితర చోట్ల కూడా తరచూ అల్లరి మూకలు రైళ్లపై రాళ్ల దాడులకు పాల్పడుతున్నారు. ఈ దాడుల నిరోధానికి అక్కడి జీఆర్‌పీ, ఆర్పీఎఫ్‌ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. రైల్వే చట్టం-1989 ప్రకారం 151, 151 (3), 152 సెక్షన్ల కింద కేసులను నమోదు చేస్తున్నారు.

### ప్రచారానికి శ్రీకారం

రాళ్ల దాడుల నిరోధానికి కాచిగూడ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌లాల్‌, ఆర్పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, పాతబస్తీలోని శాంతిభద్రతల పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లతో కలిసి సంయుక్తంగా ప్రచారం చేపట్టారు. ఫలక్‌నుమా, బుద్వేల్‌, ఉందానగర్‌ స్టేషన్లలో ప్రయాణికులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. పాతబస్తీలోని పట్టాల పక్కనున్న బస్తీలు, మురికివాడల్లో కరపత్రాల ప్రచారాన్ని చేపట్టారు. ఒక పక్కన ప్రయాణికులు, తల్లిదండ్రులు, పిల్లలు, యువకులకు అవగాహన కల్పిస్తూనే మరో పక్కన చట్ట ప్రకారం తీసుకునే చర్యలను వివరిస్తున్నారు. దాడులకు పాల్పడే వారిపై జీఆర్‌పీ వారు ఐపీసీ సెక్షన్లు 324, 427, దాడి తీవ్రతను బట్టి 307 సెక్షను నమోదు చేయాలని నిర్ణయించారు. ఆర్పీఎఫ్‌ అధికారులు రైల్వే చట్టం ప్రకారం... ఆస్తుల నష్టానికి పాల్పడితే 154, రైలు పట్టాల పైకి వస్తే 147 సెక్షను కింద ట్రెస్‌పాస్‌ కేసులు చేస్తున్నారు.

### దాడులు ఆగే వరకు కార్యక్రమం

*- ఎస్‌.రాజేంద్రప్రసాద్‌, రైల్వే ఇన్‌ఛార్జి ఎస్పీ, సికింద్రాబాద్‌*

రైళ్లపై రాళ్ల దాడుల నిరోధానికి పీడీ పీపీ యాక్ట్‌ కింద కేసులను నమోదు చేస్తున్నాం. రైలు పట్టాల వెంబడి పెట్రోలింగ్‌ ముమ్మరం చేశాం. సమస్యాత్మక ఎంఎంటీఎస్‌ స్టేషన్లలో మఫ్టీ పోలీసులను ఏర్పాటు చేశాం. రాళ్ల దాడులు ఆగే వరకు ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుంది.



## అనుమతి లేని కట్టడంలో అగ్నిప్రమాదం


ప్రమాదం జరిగిన కార్ల షెడ్డు వద్ద జనం

**అల్వాల్‌:** అల్వాల్‌లో అనుమతి లేని ఓ షెడ్డులో అగ్నిప్రమాదం సంభవించింది. కానాజిగూడ ప్రధాన రహదారి పక్కనే ఓ షెడ్డులో బాబా సాయి కార్‌ కేర్‌ కేంద్రం నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం షెడ్డు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చి క్షణాల్లో వ్యాపించాయి. దీంతో ఐదు కార్లతోపాటు కార్ల విడిభాగాలు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పివేశారు. షార్ట్‌ సర్క్యూటే ప్రమాదానికి కారణమని నిర్వాహకుడు సాయిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఒకప్పుడు వ్యవసాయ బావిగా ఉన్న స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఈ షెడ్డులో భద్రత ఏర్పాట్లను పట్టించుకోకుండా అధికారులు వ్యాపార నిర్వహణకు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశమైంది. గత డిసెంబరులో ఇలాంటి గోదాములోనే అగ్నిప్రమాదం చోటు చేసుకోగా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్పట్లో అక్రమ గోదాములను తొలగించారు. అయినా సర్కిల్‌ పరిధిలో జనావాసాల నడుమ అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం కొనసాగుతుండటం గమనార్హం.

## రైల్వేకోర్టుకు ముగ్గురు మంత్రులు హాజరు



తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011లో మౌలాలిలో చేపట్టిన రైల్‌రోకో కార్యక్రమం పాల్గొన్న నేపథ్యంలో నమోదైన కేసులో రాష్ట్ర మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్‌, టి.పద్మారావు సోమవారం బోయిగూడలోని రైల్వేకోర్టుకు హాజరయ్యారు. ఈనెల 30న మళ్లీ హాజరుకావాలని జడ్జి సూచించారు. -న్యూస్‌టుడే, సికింద్రాబాద్‌

## ఎంజీబీఎస్‌లో ప్లాట్‌ఫాంపై ఆడ శిశువు



**బేగంబజార్‌, న్యూస్‌టుడే:** ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఎంజీబీఎస్‌లోని ఫ్లాట్‌ఫారం వద్ద వదిలి వెళ్లారు. అఫ్జల్‌గంజ్‌ పోలీసు స్టేషన్‌ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్‌లోని 50వ నంబరు ప్లాట్‌ఫాం చెంత ప్రయాణికులు కూర్చునే కుర్చీల వద్ద సోమవారం మధ్యాహ్నం శిశువు ఏడుపు వినిపిస్తుండటంతో పారిశుద్ధ్య పనులు నిర్వహించే మహిళా కార్మికులు గమనించారు. సుమారు ఐదు రోజుల వయసున్న ఈ శిశువు నీలి రంగు వస్త్రంలో చుట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. శిశువు ఆరోగ్యంగానే ఉండటంతో పోలీసులు శిశువు విహార్‌కు అప్పగించారు. ఎంజీబీఎస్‌లో ఎవరు వదలి వెళ్లారో గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలోని ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో విద్యుదాఘాతం

### భయంతో పరుగులు తీసిన రోగులు


వార్డుల నుంచి బయటకు వచ్చిన రోగులు, సిబ్బంది

**బేగంబజార్‌, న్యూస్‌టుడే:** ఉస్మానియా ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి కార్యాలయంలో విద్యుదాఘాతంతో ఏసీ యంత్రం దగ్ధమైంది. మంటలు, దట్టమైన పొగ ఎగిసి పడటంతో రోగులు, వారి సహాయకులు భయంతో పరుగులు తీశారు. వివరాలిలా ఉన్నాయి... సోమవారం ఉదయం ఓపీ రోగులను పరీక్షించిన అనంతరం నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్‌ మనీషా సహాయ్‌ కులీకుతుబ్‌షా భవనం మూడో అంతస్తులోని తన కార్యాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం సూపరింటెండెంట్‌, ఆర్‌ఎంవోలు వార్డులకు రావడంతో కార్యాలయానికి తాళం వేసి రెండో అంతస్తులోకి వెళ్లారు. ఈ సమయంలో కార్యాలయం నుంచి మంటలు, పొగ రావడంతో పక్కనే ఉన్న వార్డుల నుంచి రోగులు. . వారి సంబంధీకులు గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి పరుగులు తీశారు. అధికారులు గౌలిగూడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో పాటు నెఫ్రాలజీ విభాగ కార్యాలయానికి విద్యుత్తు సరఫరా నిలిపివేయించారు. కార్యాలయం తెరిచి కిటికీల అద్దాలను పగులగొట్టడంతో పొగ బయటకు వెళ్లింది. ఇంతలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. దీంతో రోగులు, వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలిని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ జీవీఎస్‌ మూర్తి, అదనపు సంచాలకులు డాక్టర్‌ అంజయ్య, ఆర్‌ఎంవోలు డాక్టర్లు రఫీ, సిద్దిఖీ, డాక్టర్‌ మనీషా సహాయ్‌, డాక్టర్‌ రాకేశ్‌ సహాయ్‌ సందర్శించారు.

## నాలాలో పడి వ్యక్తి దుర్మరణం

**మూసాపేట:** నాలాలో పడి ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. కూకట్‌పల్లి ఎస్సై జి.గోపినాథ్‌ తెలిపిన ప్రకారం.. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన షేక్‌బషీర్‌ (65) సింధూ ట్రావెల్స్‌ సంస్థకు కాపలాదారుగా పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటల వరకు విధుల్లో ఉన్న ఇతను కనిపించకుండా పోయాడు. ఆదివారం ఉదయం మూసాపేట శక్తీనగర్‌ నాలాలో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఇతన్ని గుర్తించారు. సంస్థ పక్కనేఉన్న నాలా కల్వర్టుపై కూర్చుని ఉన్న సమయంలో ఇతను ప్రమాదవశాత్తు నాలాలో పడి కొట్టుకుపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

## లిఫ్ట్‌ ఇచ్చి.. నగదు లాక్కుని పరారీ

*హయత్‌నగర్‌, న్యూస్‌టుడే:* నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తికి లిఫ్ట్‌ ఇస్తామంటూ వాహనంపై ఎక్కించుకుని అతడ్ని బెదిరించి రూ.7వేల నగదును లాక్కుని పరారైన సంఘటన హయత్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మన్సూరాబాద్‌ డివిజన్‌ విజయనగర్‌ కాలనీకి చెందిన డి.శ్రీను(29) రంగారెడ్డి జిల్లాకోర్టులో టైపిస్టుగా పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతను స్వగ్రామం ఖమ్మం నుంచి నగరానికి వస్తూ అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో హయత్‌నగర్‌లో బస్సుదిగి కుంట్లూర్‌ రోడ్డులో నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అతడ్ని ఆపి లిఫ్ట్‌ ఇస్తామని చెప్పారు. వారిని నమ్మిన శ్రీను వారితోపాటు బైక్‌ఎక్కాడు. వారు బైక్‌ని శ్రీను ఇంటికి సమీపంలో నిలిపి జేబులోని డబ్బులు ఇవ్వాలని లేనిపక్షంలో కొడతామని బెదిరించారు. భయపడిన శ్రీను పర్సులోని రూ.7వేల నగదు వారికి ఇచ్చాడు. దాన్ని తీసుకున్న ముగ్గురు వ్యక్తులు అక్కడినుంచి పరారయ్యారు.

## దొంగనోట్ల కేసులో నిందితులకు అయిదేళ్ల జైలు

నిజామాబాద్‌ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: దొంగనోట్ల కేసులో ఐదుగురికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మూడో అదనపు ఇన్‌ఛార్జి జిల్లా జడ్జి నూరిల్లఘోరీ సోమవారం తీర్పునిచ్చారు. వివరాలివీ.. కంఠేశ్వర్‌కు చెందిన గంధం భూమేశ్వర్‌, ఎల్లమ్మగుట్టకు చెందిన న్యాలం రాజేశ్వర్‌లు దేవీరోడ్‌లోని ఐఎన్‌జీ వైశ్యాబ్యాంకులో దొంగనోట్లను నరేశ్‌ ఖాతాలో వేస్తుండగా బ్యాంక్‌ క్యాషియర్‌ వాటిని గమనించి మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గమనించిన రాజేశ్వర్‌, భూమేశ్వర్‌లు అక్కడి నుంచి పారిపోవడంతో బ్యాంకు సిబ్బంది ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే గంధం భూమేశ్వర్‌, న్యాలం రాజేశ్వర్‌లను విచారించగా వారికి పంపిణీ చేసిన హైదరాబాద్‌ కొత్తపేట్‌కు చెందిన కిషన్‌, జీడిమేట్లకు చెందిన బండి సత్యం, నంద్యాలకు చెందిన కిరణ్‌ల వివరాలు చెప్పడంతో పోలీసులు వీరిపై ఐపీసీ 489(బి)489(సి) సెక్షన్‌ ప్రకారం కేసును నమోదు చేసి కోర్టుకు పంపారు. పోలీసుల తరపున అదనపు కోర్టు పీపీ రత్నాకర్‌రెడ్డి వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి అయిదుగురు నిందితులకు అయిదేళ్ల జైలుశిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



29.4 శాతం పిల్లలు..

దంత సంబంధ సమస్యలతో బాధ పడుతున్నారు.

13 శాతం పిల్లలకు..

చర్మ సంబంధ వ్యాధులున్నాయి..

4.5 శాతం మంది పిల్లలు..

'ఎ' విటమిన్ తక్కువగా ఉండటంతో కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

కొందరు పిల్లలకు గుండె జబ్బులు కూడా ఉన్నాయి

పసి ప్రాయంలోనే ఆరోగ్య సమస్యలు..

# ఆ పిల్లలు.. ఆరోగ్యానికి దూరమే!

## వైద్యుల పరిశీలన ఇలా..

నగర శివారుసహా రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను ఇటీవల వైద్య బృందాలు పరిశీలించాయి. వీరి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసాయి. అయితే అనూహ్యంగా ప్రతి నలుగురు పిల్లల్లో ఒకరికి ఏదో ఒక అనారోగ్య లక్షణాలు కనిపించాయి. మొత్తం 128 ప్రభుత్వ పాఠశాలలు, మరో 95 అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న మొత్తం 16,475 మంది పిల్లలను వైద్యఆరోగ్య శాఖ నేతృత్వంలో వైద్య బృందాలు పరిశీంచాయి. ఇందులో 8,598 మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వస్తుంటే మిగిలిన 7,518 మంది అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న 6 ఏళ్లలోపు పిల్లలు కావడం గమనార్హం.



సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ రోడ్డు నుంచి బేగంపేట విమానాశ్రయం రన్‌వేపై సోమవారం దిగుతున్న విమానం వాహనాలకు దగ్గరగా దిగుతున్నట్లుగా ఇలా కనిపించింది

**30 శాతం మంది పిల్లలకు దంత సమస్యలు ● వైద్యుల పరిశీలనలో తేలిన నిజాలు**

ఈనాడు–హైదరాబాద్

పాఠశాల వయస్సులోనే పిల్లలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి నలుగురు పిల్లల్లో ఒకరికి ఏదో ఒక సమస్య ఉంటోంది. అయితే ఈ సమస్యలు ప్రాణాంతకమైనవి కాకపోయినా ఆరోగ్యపరంగా ఇబ్బంది కలిగించేవే. అంతేకాదు ఈ సమస్యలకు అవగాహన లోపం, నిర్లక్ష్యమే కారణాలని నిపుణులు చెపుతున్నారు. పసివయస్సులో పిల్లలకు ఆరోగ్యంపట్ల వ్యక్తిగత శుభ్రతపట్ల అవగాహన కల్పించే వారు లేకపోవడం.. ఇళ్లల్లో పిల్లల ఆరోగ్యంపట్ల శ్రద్ధ కనబరిచే పరిస్థితులు లేకపోవడంలాంటి కారణాలతో పిల్లలు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

### సర్వేలో తేలిందిలా..

● మొత్తం 16,475 మంది పిల్లలకుగాను అత్యధికంగా 4,848 మంది పిల్లల్లో దంత సంబంధిత సమస్యలు కనిపించాయి. కొందరి పిల్లల పళ్లు అప్పుడే పుచ్చిపోతున్నాయి. అయితే ఈ పిల్లలుగానీ వీరి తల్లిదండ్రులుగానీ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడం లేదు. ఇలా పిల్లలు దంత సమస్యలు ఎదుర్కోవడానికి ప్రధానంగా రెండు కారణాలు చెపుతున్నారు. పిల్లల ఆహారపు అలవాటు ఒక కారణం కాగా పళ్ల శుభ్రత విషయంలో వీరికి అవగాహన లేకపోవడమే. తల్లిదండ్రులు పట్టించుకోరు. పాఠశాలల్లో కూడా ఇందుకు సంబంధించిన అవగాహన కల్పించేవారు తక్కువే అందువల్ల పిల్లలు శ్రద్ధ చూపించకపోవడం వల్ల త్వరగా పంటి సమస్యలు ఎదర్కొంటున్నారు.

● చర్మవ్యాధులు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి నగర శివారుల్లోనూ.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉండే పిల్లలు వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ కనబరచడం తక్కువే. స్నానం చేయకుండానే పాఠశాలలకు వస్తుంటారు. రెండు మూడు రోజులకు ఒకసారి స్నానం చేయడం.. చేసినప్పుడు కూడా సరిగ్గా సబ్బు వాడకపోవడం లాంటి కారణాల వల్ల గజ్జి, తామర లాంటి చర్మ వ్యాధులు అత్యధికుల్లో కనిపిస్తున్నాయి. పరిశీలించిన వారిలో సమారు 2,258 మంది పిల్లలకు చర్మ వ్యాధులున్నాయి.

● కంటి సమస్యలతో బాధపడే వారు కూడా అధికంగానే ఉన్నారు. ఇందులో ప్రత్యేకించి 'ఎ' విటమిన్ లోపం కారణంగా పిల్లల కళ్లల్లో నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. ఇలా మొత్తం పరిశీలించినవారిలో 652 మంది పిల్లల కళ్లల్లో నల్లటి మచ్చలున్నాయి. ఇది కాకుండా దృష్టి లోపంతో బాధపడే పిల్లలు కూడా ఉన్నారు. వీరు నల్లబల్ల (బ్లాక్ బోర్డు)పై ఉపాధ్యయులు రాసే అక్షరాలు కనబడక ఇబ్బందులు పడుతుంటారు. అయితే తమ కళ్లల్లో లోపం ఉందనే విషయం ఈ పిల్లలకూ తెలియదు.. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పరు. దృష్టిదోషంతో బాధ పడే పిల్లలు చదువుల్లో కూడా వెనబడుతుంటారని ఉపాధ్యాయులు చెపుతుంటారు.

● రక్తహీనతతో బాధ పడే పిల్లలు 755 మంది ఉన్నారు. వీరిలో హిమోగ్లోబిన్ శాతం మరీ తక్కువగా ఉంటోంది. కొందరిలో పది శాతం కూడా ఉండటంలేదు. దీంతో ఈ పిల్లలు పాఠశాలలకు వస్తున్నా నీరసంగా ఉంటున్నారు. చలాకీతనం లోపిస్తోంది.

● 125 మంది పిల్లలు గుండే సంబంద సమస్యలతో సతమతమవుతున్నారు. గుండెకు చిల్లు ఉండటం సహా వివిధ రకాల గుండె సమస్యలు వీరు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది.

### అవగాహనే ప్రధానం

పిల్లలకు వ్యక్తిశుభ్రతకు సంబందించి అవగాహన కల్పించడమే ప్రాధానం. నగర శివారులు.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పిల్లల తల్లిదండ్రులకు అవగాహన తక్కువగా ఉంటుంది. అందువల్ల పాఠశాలలో ఉపాధ్యాయులే ఈ విషయంలో కొంత చొరవ చూపడం అవసరం. పిల్లలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తే ఫలితం ఉంటుందని నిపుణులు చెపుతున్నారు.

## అమెరికాలో భారతీయ మతాలు, విశ్వాసాలు

బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లో చిత్ర ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా



ప్రదర్శనలోని ఓ చిత్రం

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** శతాబ్దాలుగా అమెరికాలో నివసిస్తున్న భారతీయుల సంప్రదాయాలు, మతాలు, మతవిశ్వాసాలు విరాజిల్లుతున్న తీరును తెలియజేస్తూ సోమవారం బీఎం బిర్లా సైన్స్ సెంటర్ ప్రాంగణంలోని నిర్మలా బిర్లా ఆఫ్ మాడ్రన్ ఆర్ట్ గ్యాలరీలో ప్రత్యేక చిత్ర ప్రదర్శన కొలువుదీరింది. యూఎస్ కాన్సులెట్ జనరల్ హైదరాబాద్, నిర్మలా బిర్లా గ్యాలరీ ఆఫ్ మాడ్రన్ ఆర్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో 'కీపింగ్ ఫెయిత్: ఇండియన్ రెలిజియన్స్ ఇన్ ద యునైటెడ్ స్టేట్స్' పేరిట ఏర్పాటైన ఈ ప్రదర్శనను సోమవారం కాన్సుల్ జనరల్ కెథరీన్ హడ్డా ప్రారంభించారు. అమెరికాలో హిందూ, ముస్లిం, పార్సీ, బుద్ధిజం, జైనిజం వంటి భిన్నమతాలు, సంప్రదాయాలు కనిపిస్తున్నాయన్నారు. బీఎం బిర్లా సైన్స్ సెంటర్ సంచాలకులు డా. బి. జి. సిద్దార్థ పాల్గొన్నారు.

## కైండ్‌నెస్ వలంటీర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** నిరుపయోగంగా ఉన్న పాత పుస్తకాలు, దుస్తులతోపాటు ఇతర వస్తువులను నిరుపేదలైన వారికి అందించేందుకు బల్దియా వాల్ ఆఫ్ కైండ్‌నెస్ పేరుతో బృహత్తర కార్యక్రమం చేపట్టింది. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కైండ్‌నెస్ వలంటీర్లుగా స్వచ్ఛందంగా సేవలందించేందుకు ఆసక్తి ఉన్న సీనియర్ సిటిజన్లు, విశ్రాంత ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇప్పటికే 50 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ కైండ్‌నెస్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని బల్దియా పేర్కొంది. ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా తీసుకెళ్లి పౌరుల్లో అవగాహన తెచ్చేందుకు ఈ నియామకాలను చేపట్టనున్నట్లు బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. ఆసక్తి ఉండి స్వచ్ఛందంగా సేవలందించే వారు ఆయా బల్దియా ఉప కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## తప్పుడు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన నిందితుడి అరెస్ట్

**ఈనాడు, హైదరాబాద్:** తప్పుడు బ్యాంకు గ్యారెంటీ పత్రాలు సృష్టించి మోసం చేసిన కేసులో మూడో నిందితుడు సుమిత్ అగర్వాల్‌ను సీసీఎస్ పోలీసులు కోల్‌కతాలో సోమవారం అరెస్ట్‌చేశారు. హైదరాబాద్‌కు చెందిన క్యోరీ ఒరిమిన్ సంస్థకు రూ. 6.6 కోట్ల బ్యాంకు గ్యారెంటీని కోల్‌కతాలోని ఇండియన్ బ్యాంక్ ఇచ్చినట్టు సుమిత్ అగర్వాల్ పత్రాలను సృష్టించారు. ఈ కేసులో ఇప్పటి వరకు ప్రధాన నిందితుల్లో ఒకడైన గోవింద్ సల్గోంకర్‌ను కొద్దిరోజుల క్రితం అరెస్ట్‌చేశారు. ఇతడు ఇచ్చిన సమాచారంలో పోలీస్ ప్రత్యేక బృందం కోల్‌కతాకు రెండు రోజుల క్రితం వెళ్లింది. అక్కడే కోర్టులో హాజరుపరిచి పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు.


ఖైరతాబాద్ వినాయకుడికి...

## ప్రముఖుల పూజలు

**ఖైరతాబాద్:** ఖైరతాబాద్ మహా గణపతి దర్శనంకోసం భక్తులు ప్రవాహంలా తరలివస్తున్నారు. సెలవు రోజుల్లోనే కాకుండా సోమవారం వేకువజాము నుంచే పెద్ద ఎత్తున చేరుకున్నారు. పలువురు ప్రముఖులు హాజరై వినాయకుడి చెంత పూజలు చేశారు. అతిథులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. తెదేపా తెలంగాణ అధ్యక్షులు ఎల్. రమణ, సీనియర్ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి పూజలు చేశారు. వారితో పాటు పార్టీ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్, వనం రమేష్, శ్రీనివాస్‌నాయుడు, ఆవుల అనిల్‌కుమార్, వంశీ కృష్ణ, అయూబ్‌ఖాన్ తదితరులు ఉన్నారు. మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు మహేందర్‌బాబు, చంద్రశేఖర్, బాల్‌కుమార్ తదితరులు వచ్చారు.



గణపతిని దర్శించుకున్న ఎల్.రమణ తదితరులు



పూజల అనంతరం సి.కృష్ణాయాదవ్



తల్లిదండ్రుల విగ్రహాలకు నమస్కరిస్తున్న శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి

## తల్లిదండ్రులు దైవంతో సమానం

**కొత్తపేట, న్యూస్‌టుడే:** జన్మనిచ్చిన తల్లిదండ్రులు దైవంతో సమానమని తెలంగాణ శాసనసభ స్పీకర్ ఎస్. మధుసూదనాచారి అన్నారు. ఆయన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, వెంకటనరసయ్యల విగ్రహాలను స్వగ్రామం వరంగల్ జిల్లా పరకాల మండలం నరసక్కపల్లి గ్రామంలో గుడి నిర్మించి ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి విగ్రహాల తయారీ బాధ్యతను కొత్తపేటకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన శిల్పి వడయార్‌కు అప్పగించారు. ఇందులో భాగంగా విగ్రహాల రూపరేఖలను పరిశీలించేందుకు ఆయన వచ్చి సంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దిపాటి మార్పులను సూచించారు.

# దళారీ గుప్పిట్లో నచ్చిన సీటు



● దందాకు తెరలేపుతున్న కొన్ని కళాశాలలు

● మెడికల్, ఇంజినీరింగ్‌లో కమీషన్ల పంట

ఈనాడు, హైదరాబాద్

విద్యారంగంలో దళారుల దందా జోరుగా సాగుతోంది. నచ్చిన కళాశాలలో ఇష్టమైన కోర్సుల్లో సీటు ఇప్పిస్తామంటూ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు దళారులు నమ్మబలుకుతున్నారు. నగరంలో చాలా కళాశాలలు సీట్లు భర్తీ చేసుకొనేందుకు వీరిని ఆశ్రయిస్తున్నాయి. ఒక్కొక్క సీటుకి 10 నుంచి 30 శాతం కమీషన్ ఇస్తున్నాయి. ఒక్కరూపాయి పెట్టుబడి పెట్టకుండానే దళారులు ఆర్జిస్తున్నారు. మెడికల్, ఇంజినీరింగ్ డిగ్రీల్లో చేరాలనుకునే విద్యార్థుల సమాచారాన్ని వీరు పలుమార్గాల్లో సేకరిస్తున్నారు. వీరికి తరచూ ఫోన్‌చేసి ఎక్కడ సీటు కావాలన్నా ఇప్పిస్తామని, సీటు వచ్చిన తర్వాతే కమీషన్ ఇవ్వండని పలువురు దళారులు అభ్యర్థులకు వివరిస్తున్నారు. నగరంలో చాలా కళాశాలలు ఈ దళారులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది.

### డబ్బులు ఇవ్వొద్దంటూ ప్రచారం

ప్రతి సీటు దళారుల ద్వారా భర్తీ అయితే కళాశాలల యాజమాన్యాల నుంచి కమీషన్ ఇస్తున్నాయి. సీటు ఇప్పించినందుకు అభ్యర్థుల నుంచి ఎంతో కొంత సొమ్మును దళారులు వసూలు చేస్తున్నారు. సీట్లు, కోర్సులు ఎక్కడ ఎంపిక చేసుకోవాలన్నా చేస్తున్న ఉద్యోగాలకు అభ్యర్థుల తల్లిదండ్రులు సెలవులు పెట్టి తిరగాల్సి వస్తోంది. దళారులను ఆశ్రయిస్తే సమగ్ర సమాచారం చరవాణిల్లో అందిస్తున్నారని పలువురు వీరినే ఆశ్రయిస్తున్నారు. కొందరు దళారులు ముందస్తుగా డబ్బులు కాజేసి ముఖం చాటేస్తున్నారు. ఇలాంటి పలు సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. సీట్లు ఇప్పిస్తామంటున్న దళారులను నమ్మి డబ్బులు ఇవ్వద్దని పోలీసులు.. కళాశాలల వద్ద గోడపత్రికలను ఏర్పాటు చేయిస్తున్నాయి.

### ఇతర రాష్ట్రాల్లోనూ హవా

మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని ఏ కళాశాలలో కావాలన్నా ఇప్పిస్తామంటూ దళారులు ప్రచారం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, చెన్నైలోని కళాశాలలకు ఈ దళారులు అభ్యర్థులను పంపిస్తున్నారు. మెడికల్‌సీటులో ఒక్కొక్కరి నుంచి ముందుగా రూ.20 వేల వరకు తీసుకుంటున్నారు. సీటు ఖరారు అయిన తర్వాత ఒప్పందం ప్రకారం మిగతా మొత్తాన్ని దళారులు వసూలు చేసుకుంటున్నారు. సీట్లు ఉన్నాయా అని ఏదైనా కళాశాలకు ఫోన్ చేస్తే కనీసం సమాచారం చెప్పని ఉద్యోగులు.. దళారులకు సమగ్ర సమాచారం ఇచ్చేస్తున్నారు. కళాశాలల యాజమాన్య ప్రతినిధులతోను దళారులు ఫోన్‌లో అభ్యర్థుల తల్లిదండ్రులతో మాట్లాడించడం విశేషం. అభ్యర్థుల నుంచి డబ్బులను బ్యాంకు ఖాతాల్లో వేయకూడదని నిబంధన విధిస్తున్నారు. కొందరు దళారులు విదేశాల్లో కళాశాలలతో ఒప్పందాలు కుదుర్చుకొని నగరంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

### వారి చేతుల్లోకి ఎలా వెళ్తున్నాయి?

నగరంలోని ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సమగ్ర సమాచారం దళారుల చేతుల్లోకి చేరిపోతోంది. అభ్యర్థులకు చరవాణిలో దళారులు సంప్రదింపులు చేస్తున్నారు. ఎంసెట్, మెడికల్‌లో ర్యాంకులు సాధించిన వారి వివరాలు దళారులు సేకరించారు. ఏదైనా పరీక్ష ఫలితాలు అభ్యర్థుల తరఫున ఇతరులు ఎవరైనా చూడాలంటే ఓటీపీ లేదా పుట్టినతేదీ, నెల వంటి సమాచారం అడుగుతుంది. అలాంటిది పూర్తి బయోడేటా దళారులకు ఎలా చేరుతోందనే అంశంపై యాజమాన్యాలపై ఆరోపణలున్నాయి. సమాచారాన్ని కొందరు దళారులకు అమ్మేస్తున్నారనే విమర్శ ఉంది. ఆయా ప్రవేశ పరీక్షల సమాచారాన్ని కంప్యూటరీకరణ చేసేవారిలో ఎక్కువమంది ఒప్పంద ఉద్యోగులే. వారికి వచ్చే కొద్దిపాటి జీతంతో సంతృప్తి చెందకుండా అభ్యర్థుల సమాచారాన్ని ఇతరులకు అందజేసి పలువురు సొమ్ముచేసుకుంటున్నట్లు సమాచారం.



సికింద్రాబాద్ బోయిగూడ బ్రిడ్జి వద్ద రహదారి దుస్థితి



మూసాపేట వద్ద గొయ్యిలా మారిన సర్వీసు రహదారి

## గుంతలు.. గంతలు

(మొదటి పేజీ తరువాయి) తరగతులు నిర్వహించినా.. సిబ్బంది పాత పద్ధతిలోనే పూడ్చుతున్నారు. వర్షపునీరు, బురద, ఇతర వ్యర్థాలను తీయకుండా వెంట తీసుకొచ్చిన తారు, కంకర మిశ్రమాన్ని నింపి వెళ్తున్నారు. దాంతో పూడ్చిన మరుసటి రోజున ఆ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారుతోంది. రోడ్డుపై తారు, ఇసుక చల్లినట్లుగా విస్తరిస్తోంది. దానిపై వెళ్లే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడుతున్నాయి. గత మూడు రోజులుగా వానలకు గ్రేటర్ వ్యాప్తంగా 1,600ల గుంతలు పడ్డాయని అధికారులు తేల్చారు. రోజుకు 300ల నుంచి 400ల గుంతల్ని పూడ్చుతున్నామని ముఖ్య ఇంజినీరు జియాఉద్దీన్ తెలిపారు. సాధ్యమైనంత వరకు శాస్త్రీయంగా పూడ్చేలా సిబ్బందిని మార్గదర్శనం చేస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే పరిస్థితి మెరుగైందని వివరించారు.

**ప్రమాదాలతో పోతున్న ప్రాణాలు..** గతేడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రహదారి గుంతల వల్ల ఐదుగురు మరణించారు. హైటెక్ సిటీలో యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, మూసాపేట దగ్గరి వై-జంక్షన్ కూడలిలోని కాలేజీ విద్యార్థి మరణించిన ఘటనలు నగరవాసుల్ని తీవ్రంగా కలిచివేశాయి. వాళ్లతో పాటు మరో ముగ్గురు వేర్వేరు ప్రాంతాల్లో దుర్మరణం పాలయ్యారు.



కేపీహెచ్‌బీ రోడ్ నంబరు-4లో గుంతలు పడిన రహదారి

## 'వరద' కష్టాలు కొనసాగుతాయి!

(మొదటి పేజీ తరువాయి) ఇవ్వక్కర్లేదు. మురికివాడల్లోని నిర్వాసితులకు సర్కారు ఇళ్లు కేటాయిస్తుంది. ఇక ప్రైవేటు ఆస్తులపైనే స్పష్టత రావట్లేదు. ఆక్రమణలు అయినందున పరిహారం చెల్లించకుండా కూలగొట్టేయాలా? లేక పాక్షికంగా ఇవ్వాలా? అనే అంశంపై ఆదేశాలు కోరాం. జీవో వచ్చాక పనులు చేపడతాం."అని ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి దేవేందర్‌రెడ్డి 'ఈనాడు'కు తెలిపారు.

### నేతల ఒత్తిడే కారణమా?

భారీగా చేపట్టాల్సిన ఉన్న కూల్చివేత ప్రక్రియతో స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతాయని, ఆపేసి ప్రత్యామ్నాయం ఆలోచించాలని స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులు బల్దియాపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే రెండు రోజుల్లోనే అధికారులు చాపచుట్టేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదనకు అధికారులు తలొగ్గినట్లు సమాచారం. అధికారులు నేతల ఒత్తిడికి తలొగ్గకుండా వర్షాకాల కష్టాల నుంచి తమను గట్టెక్కించాలని నాలా పరివాహక ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## అమెరికా చదువు ఆశలు గల్లంతు

● రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



సుమంత్ (పాతచిత్రం)

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: మరో రెండువారాల్లో అమెరికాలో డిగ్రీ చదువుకునేందుకు సిద్ధమవుతున్న ఆ విద్యార్థి రోడ్డుప్రమాదంలో అసువులు బాసిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సీతాఫల్‌మండిలో నివాసముంటున్న వీఎన్ చంద్రశేఖర్ కుమారుడు వీసీ సుమంత్(21) డిగ్రీ ప్రథమ సంవత్సరం నగరంలో చదువుతున్నాడు. డిగ్రీ చదవడానికి వీసా సిద్ధమైంది. మైలార్‌గడ్డలో నివాసముండే మిత్రుడు అజయ్‌తో ఆదివారం రాత్రి ఇంట్లో గడిపాడు. రాత్రి 11:45 గంటల సమయంలో అజయ్ వాళ్ల ఇంటివద్ద దిగబెట్టడానికి తన యాక్టివా ద్విచక్రవాహనం తీసుకుని బయలుదేరాడు. సీతాఫల్‌మండి చౌరస్తా దాటగానే ఎదురుగా అతివేగంతో వచ్చిన లారీ ఢీకొట్టి వెళ్లింది. సుమంత్ తలకు.. అజయ్‌కు కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గాంధీ ఆసుపత్రికి తరలించగా సుమంత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అమెరికాకు వెళ్లాల్సిన యువకుడు దుర్ఘటన పాలవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై స్కార్పియో బీభత్సం

● అదుపుతప్పి బైక్, మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన వాహనం

● యూటీఎఫ్ శంషాబాద్ మండలాధ్యక్షుడు మృతి





ప్రమాదానికి కారణమైన స్కార్పియో.. మృతుడు గోపాల్‌యాదవ్(పాత చిత్రం)

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి రహదారిపై డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఓ బైకు, మరో మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో మదనపల్లి వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. శంషాబాద్ ఠాణా ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. శంషాబాద్ పరిధిలోని పిల్లోనిగూడకు చెందిన నక్క గోపాల్‌యాదవ్(55) స్థానిక ఎయిర్‌పోర్ట్ కాలనీ ప్రభుత్వ పాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఆయన టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. సోమవారం సాయంత్రం పాఠశాలలో విధులు ముగించుకొని బైకుపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మదనపల్లి వద్దకు రాగానే హైదరాబాద్‌కు చెందిన నలుగురు యువకులు షాద్‌నగర్‌లో పార్టీ చేసుకొని స్కార్పియో వాహనంలో వేగంగా నగరానికి వెళుతున్నారు. మదనపల్లి సమీపంలో మూల మలుపు వద్ద అతివేగంతో స్కార్పియో అదుపుతప్పి జాతీయ రహదారి డివైడర్‌ను దాటి అవతలివైపు రోడ్డుపై ఎదురుగా వస్తున్న బైక్, మినీ వ్యాన్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల మధ్యన ఇరుక్కున్న గోపాల్‌యాదవ్ బైక్ ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మినీవ్యాన్ డ్రైవర్ భద్రను ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రభావతి, కుమారులు అజయ్, విజయ్ ఉన్నారు. ప్రమాదానికి కారణమైనా యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మద్యం సేవించారన్న అనుమానంతో పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## నైజీరియన్ల మాయాజాలం!

(మొదటి పేజీ తరువాయి) పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ జానకి శర్మిల కథనం ప్రకారం.. నైజీరియాకు చెందిన గౌజాఅరిస్టైడ్, ఒమెకే ఎరిక్ తోచుక్వు, ఒక్‌వెరీ తోచుక్వులు భారత్‌కు వచ్చి దిల్లీలో ఉంటూ ఆన్‌లైన్ మోసాలే వృత్తిగా చేసుకున్నారు. రూ.కోట్లలో లాటరీ తగిలిదంటూ ప్రజల చరవాణులకు సంక్షిప్త సందేశాలు వివిధ దశల్లో లాటరీ క్లియరెన్స్ అంటూ తమ ఖాతాల్లో బాధితుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు జమ చేయించుకుని మోసగిస్తుంటారు. భారతీయులతో హిందీలో మాట్లాడి వ్యవహారం నడిపించేందుకు పశ్చిమబంగాకు చెందిన ఆనంద్ నాగేశియా అనే వ్యక్తిని నియమించుకున్నారు. తమను సంప్రదించే వారిని ఆనంద్ ముగ్గులో దించి డబ్బు లాగుతుంటాడు. ఈ క్రమంలో 2015 ఏప్రిల్‌లో నగరానికి చెందిన ఓ వ్యక్తి చరవాణికి రూ.4.5 కోట్ల శ్యాంసంగ్ లాటరీ తగిలిందని గౌజా అరిస్టైడ్ సంక్షిప్త సందేశం పంపించాడు. ఆయన స్పందించి సంప్రదించగానే రూ.500బ్యాలెన్స్ ఉన్న ఆర్‌బీఐ పేరుతో నకిలీ ఏటీఎం కార్డును, పాస్‌వర్డ్‌ను పంపించారు. దీంతో బాధితుడు నమ్మాడు. లాటరీ డబ్బులను పొందేందుకు కస్టమ్స్ ఛార్జీలు, ఇన్‌కం ట్యాక్స్ తదితరాల పేరిట 2015 ఏప్రిల్ నుంచి 2017వరకు రెండేళ్ల పాటు 20మార్లు కొంతమొత్తం చొప్పున రూ.22లక్షలు తమ ఖాతాల్లో ఆన్‌లైన్‌లో జమ చేయించుకున్నారు. పెద్దనోట్ల రద్దు సమయంలో కొన్నాళ్లు డబ్బు ఖాతాల్లో వేయడం నిలిపివేయించారు. అది సద్దుమణిగాక తిరిగి కొనసాగించారు. ఇంకా చెల్లిస్తేనే లాటరీ నగదు అందుతుందని చెప్పడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఎస్‌ఐలు విజయవర్ధన్, కె.సురేష్ కుమార్ దిల్లీకి వెళ్లి.. చరవాణి నంబర్లు, నిందితుల బ్యాంకు ఖాతా నంబర్లు, ఇ-మెయిల్ ఐడీ ఆధారంగా నిందితులను అరెస్టుచేసి నగరానికి తీసుకొచ్చారు. రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 566.20 ఎకరాలే మిగిలాయ్..!

● ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి ఇది

● వివిధ న్యాయస్థానాల్లో 1129 కేసులు

● పరిరక్షణ మరచిన హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం

● కోర్టు కేసుల్లోనూ నిర్లక్ష్యం.. ఇదే అక్రమార్కులకు వరం

ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో ఎంత ప్రభుత్వ భూమి మిగిలిందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఒకప్పుడు 18,576 ఎకరాల భూమి ఉండేది. ఇప్పుడు 566.20 ఎకరాలు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో అధిక శాతం కోర్టు కేసుల్లో చిక్కుకున్నాయంటే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే అది కూడా హాంఫట్ కావడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం

### రాత్రి నిర్మాణాలు..!

ఒకప్పుడు హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ భూములతో కళకళలాడేది. 16 మండలాల పరిధిలో 18,576 ఎకరాల భూమి ఉన్నట్లుగా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అదంతా చరిత్ర. రెండు పడక గదుల ఇళ్లకు ప్రభుత్వ స్థలాలు దొరకడం లేదంటే తాజా పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ సంస్థలు, పథకాలకు కేటాయించిన భూమి కంటే కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లినదే ఎక్కువన్నది బహిరంగ రహస్యం. అడుగు జాగా దొరకడమే కష్టం. అలాంటిది ఎలాంటి రక్షణ లేని ప్రభుత్వ భూమి దొరికితే అక్రమార్కులు ఊరుకుంటారా.. రాత్రికే రాత్రే చిన్నపాటి ఇళ్లను నిర్మించేస్తున్నారు. ఇది మా తాతలు, ముత్తాతల కాలం నాటిదంటూ నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమిస్తున్నారు. ఈ తరుణంలోనే అసలు ఎంత ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందంటూ అధికారులు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే అసలు విషయం వెలుగు చూసింది. అన్ని చోట్ల కేవలం 566 ఎకరాల 20 గుంటలు మాత్రమే ఖాళీగా ఉన్నట్లుగా తేలడంతో అధికారులే కంగుతిన్నారు.

| మండలం | మొత్తం భూమి (ఎకరాల్లో) | ప్రస్తుతం ఖాళీగా (చ.మీటర్లలో) |
|---|---|---|
| అంబర్‌పేట్ | 538.16 | 27109.99 |
| ఆసిఫ్‌నగర్ | 1755.01 | 13814.73 |
| బహదూర్‌పురా | 156.20 | 50317.67 |
| బండ్లగూడ | 924.09 | 884455.6 |
| చార్మినార్ | 267.38 | 6325.72 |
| గోల్కొండ | 1115.24 | 159241 |
| హిమయత్‌నగర్ | 48.12 | 8345.8 |
| నాంపల్లి | 1649.35 | 11911.02 |
| సైదాబాద్ | 449.4 | 43658.1 |
| అమీర్‌పేట్ | 120.17 | 6266.9 |
| ఖైరతాబాద్ | 3160.11 | 5.14(ఎకరాలు) |
| మారెడ్‌పల్లి | 1359.14 | 118233 |
| ముషీరాబాద్ | 136.13 | 36717 |
| సికింద్రాబాద్ | 202.21 | 10568 |
| షేక్‌పేట్ | 4196.31 | 708225 |
| తిరుమలగిరి | 915.09 | 1812 |
| మొత్తం | 18576.06 | 566.20(ఎకరాలు) |

### అధిక శాతం కోర్టు కేసుల్లో..

మిగిలిన భూమి అధిక శాతం కోర్టు కేసుల్లోనే చిక్కుకుంది. ఏకంగా 1129 కేసులు నడుస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సుప్రీం కోర్టులో 6, హైకోర్టులో 958, సిటీ సివిల్ కోర్టుల్లో 165 కేసులు విచారణలో ఉన్నాయి. న్యాయస్థానాల్లో కౌంటర్లు దాఖలు చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోంది. అవసరమైన పత్రాలను అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తీర్పు కబ్జాదారులకు అనుకూలంగా వస్తుంది. కొందరు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు కోర్టు కేసులపై అవగాహన లేదు. ఇంకొంత మందేమో న్యాయవాదులు, ఇతర కార్యకలాపాల ఖర్చు తడిసిమోపెడవుతుండడంతో ఉన్నదాంట్లోనే నెట్టుకొస్తున్నారు. వాస్తవానికి తహసీల్దార్లకు కోర్టు కేసుల నిమిత్తం ఎంతో కొంత ఉన్నతాధికారులు చెల్లించేవారు. కానీ కొన్నేళ్ల నుంచి అది కూడా నిలిచిపోయింది.

### వివరాలు గోప్యంగా..

వాస్తవానికి ఇతర జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి పని చాలా తక్కువగా ఉంటుంది. ముఖ్యమైన పౌర సేవలు, సంక్షేమ కార్యక్రమాలను జీహెచ్ఎంసీ అమలు చేస్తుంది. ప్రభుత్వ భూమల పరిరక్షణ, లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ పత్రాల జారీ తదితరాల కార్యకలాపాలను జిల్లా రెవెన్యూ అధికారులు నిర్వహిస్తుంటారు. అసలు పని భూముల పరిరక్షణను వీళ్లు ఎప్పుడో మరిచిపోయారు. అసలు అది మా పరిధిలోని అంశం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ల్యాండ్ బ్యాంక్ వివరాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచకుండా.. గోప్యంగా ఉంచి చోద్యం చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో కొందరు వీఆర్వోలు, ఆర్ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కవుతున్నారు. కోర్టు కేసుల్లో కౌంటర్ దాఖలు చేయడం, అవసరమైన పత్రాలను అందజేయడంలో జాప్యం చేసి.. అక్రమార్కులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కృషి చేస్తున్నారు. ఇంకొందరైతే 'కొసరు' పనులపై దృష్టి సారించారు. సంఘాల పేరుతో విధులకు ఎగనామం పెట్టి పబ్బం గడుపుతున్నారు. గతంలో పనిచేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో 'దారి' తప్పారు.

### పరిరక్షణకు చర్యలు

**మధుమోహన్, జిల్లా భూపరిరక్షణ అధికారి**

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. బాధ్యతలు స్వీకరించిన తర్వాత 9 ఎకరాలను కబ్జా నుంచి విడిపించా. సర్కార్ భూములకు సంబంధించిన సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ శాఖకు పంపించాం. ఫిర్యాదు అందగానే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. కోర్టు కేసుల విషయంలోనూ పక్కాగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వ భూములకు జియో ట్యాగింగ్ చేస్తున్నాం.

## వరద ముంపు సమస్యపై తాత్కాలిక చర్యలు

● పనులు చేపట్టిన ప్రాజక్టు విభాగం అధికారులు

● కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం



ప్రచురితమైన కథనం

శేరిలింగంపల్లి, మియాపూర్ - న్యూస్‌టుడే: ఎట్టకేలకి కల్వర్టు నిర్మాణానికి బీజం పడింది.. వరద ముంపు తీవ్ర ప్రభావం చూపకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులు సోమవారం చర్యలు ఆరంభించారు. 'పది చెరువుల నీరు.. రెండే తూములు!' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చందానగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో వరద ముంపు నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. గంగారం చెరువులోకి 10 చెరువుల నీరు రెండే తూముల గుండా వెళ్లే పరిస్థితి ఉండటంతో వరద నీరు వెనక్కి తన్ని మియాపూర్ దీప్తీ శ్రీనగర్‌తో పాటు పలు అపార్టుమెంట్ల ముంపునకు గురవుతున్నాయని వివరించిన నేపథ్యంలో గ్రేటర్ ప్రాజక్టు విభాగం అధికారులు చర్యలు ఆరంభించారు. తాత్కాలికంగా వరద నీరు వెనక్కి తన్నకుండా.. కొంత మేరైనా సాఫీగా వెళ్లేలా ప్రజానీకానికి రోడ్డు ఇబ్బంది లేకుండా ఉండే చేసే ప్రక్రియకి ముందుకు కదిలారు. నాలుగు భారీ పైపులను పెద్ద ట్రాలీ ట్రక్కులో అధికారులు తరలించారు. జేసీబీ సాయంతో తవ్వకాలు అంభించారు. పాత తూముల పక్కన తీసుకొచ్చిన పెద్దపైపులను పరవడం చేస్తున్నారు. ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలా పెద్దతూముల ఏర్పాటుతో నాలా విస్తీర్ణం 4మీటర్లకుపైగా వెడల్పు ఉంటుందని ప్రాజెక్టు విభాగం అధికారులు తెలిపారు. దీంతో దీప్తీశ్రీనగర్ ప్రాంతంనుంచి వచ్చే వరద నీరు వెనక్కి తన్నకుండా వరద నీరు పారుతుందని చెప్పారు. వర్షాకాలం ముగియగానే ఇక్కడ కల్వర్టు నిర్మాణం చేపడతామని చెప్పారు.




రెండు తూముల ప్రాంతంలో పొక్లెయిన్‌తో పనులు

**స్పందనకు వందనం**

## ఎట్టకేలకు ఫలితాలు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: సంగీతం, నృత్యం కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల ఫలితాలను పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసింది. 'గాడి తప్పిన ఫలితాలు!' శీర్షికన ఈనెల 27న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ వీసీ, అధికారులు స్పందించారు. 90రోజులు పూర్తి అయినా ఫలితాలు వెల్లడించకపోవడంపై వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ.. సంబంధిత ఉద్యోగులపై మండిపడ్డారు. 24గంటల వ్యవధిలో ఫలితాలు ఇవ్వాలని వారిని ఆదేశించారు. దీంతో యుద్ధప్రాతిపదికన మూల్యాంకనం ప్రక్రియ, కంప్యూటరీకరణను పూర్తి చేసి సోమవారం సాయంత్రానికి పరీక్షల ఫలితాలను వెల్లడించారు.



వర్షానికి నగరంలో డ్రైనేజీలు నిండి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. గుంతల్లో వరదనీరు నిలిచి ఉండడం వల్ల వాహనదారులు రాకపోకలకు నానా పాట్లు పడుతున్నారు. అధ్వాన రోడ్డు, జలం వల్ల మెహిదీపట్నం రేతిబౌలి వద్ద ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి పడిపోయాడు. వెనుక ఉన్న వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## 'కదనంలోనూ.. కథనంలోనూ మేమే' గ్రంథావిష్కరణ




ఆవిష్కరణ సభలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి తదితరులు

నారాయణగూడ: తెలంగాణ ఉద్యమంలో కవయిత్రులుగా, రచయిత్రులుగా, ఉద్యమకారులుగా పాల్గొన్నవారి అనుభవాలతో రూపొందించిన 'కదనంలోనూ.. కథనంలోనూ మేమే' గ్రంథావిష్కరణ సభ సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించారు. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ. . తెలంగాణలో స్త్రీ చైతన్యం ఎప్పటి నుంచో ఉందన్నారు. రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో రచయిత్రులుగా, కవయిత్రులుగా ఉద్యమకారులుగా వీరోచితంగా పోరాడి తమ ఉనికిని చాటుకున్నారని ప్రశంసించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ రచయిత్రి డా. ముదిగంటి సుజాతారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సాహిత్య సృజన చేసిన స్త్రీల అనుభవాలను పరిషత్తు రికార్డు చేయడం గొప్పగా ఉందన్నారు. విశిష్ట అతిథి డా. జి. అమృతలత మాట్లాడుతూ.. అన్నిట్లో సగమై ఉన్నా.. తెలంగాణ స్త్రీలు పరిపాలనలో పరాయివాళ్లుగా ఉండిపోయారన్నారు. కవయిత్రులు జూపాక సుభద్ర, అనిశెట్టి రజిత కొల్లాపురం విమల మాట్లాడారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతం పలికారు. సభలో రచయిత్రులు, కవయిత్రులు నెల్లుట్ల రమాదేవి, కొండపల్లి నిహారిణి, మేరీ మాదిగ, షాజహానా, వాణి దేవులపల్లి, జ్వలిత, జలజ, ఆర్. కమల, భండారు విజయ, పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్

## శంషాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు

శంషాబాద్: శంషాబాద్ మార్కెట్‌లో సోమవారం నాటి కూరగాయల ధరలు కిలో.. టమాట 45, ఆలుగడ్డ 25, బెండకాయ 45, దొండకాయ 25, కాకరకాయ 45, చిక్కుడుగాయ 50, సొరకాయ 25, పొట్లకాయ 20, దోసకాయ 35, గోకరకాయ 35, క్యాబేజీ 40, క్యారెట్ 30, క్యాప్సికం 45, కీరా 35, ముల్లంగి 35, ములక్కాడ 25, చేమగడ్డ 45, కందగడ్డ 35, పచ్చిమిర్చి 50, ఉల్లిగడ్డ 35, బీరకాయ 50.

# నిమజ్జనం వేళ.. నిర్లక్ష్యం వద్దు

- మండపాలు, ఊరేగింపులో జాగ్రత్తలు అవసరం
- విద్యుత్తు, రోడ్డు ప్రమాదాలపై దృష్టి పెట్టాలి
- ఉత్సవాల్లో పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే..

**కాటేదాన్, న్యూస్‌టుడే:** గణేష్ ఉత్సవాల్లో అతి ప్రధానమైనది విగ్రహ నిమజ్జనం. మేళతాళాలు.. తీన్‌మార్ నృత్యాలు.. భారీ ఊరేగింపులతో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటారు. వేలాది మంది పాల్గొనే ఈ ఊరేగింపులో చిన్న అపశ్రుతి చోటుచేసుకున్నా.. భారీ నష్టం తప్పదు. గత ఐదేళ్ల క్రితం దుర్గామాత ఊరేగింపు ఉత్సవాల్లో ఫ్లెక్సీలు తాకి పైనున్న కరెంటు తీగలతో విద్యుదాఘాతం సంభవించి ముగ్గురు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. పద్మశాలిపురంలోని జరిగిన ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన విషయం నేటికీ సర్కిల్ వాసులు మర్చిపోలేదు. కాగా ఏటా వినాయక ఉత్సవాల్లో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తప్పతాగి వాహనాల కింది నలిగిపోయి తనువు చాలించినవారితో పాటు మద్యం మత్తులో తీవ్ర ప్రమాదాల బారిన పడిన సంఘటనలూ లేకపోలేదు. ఈసారి సర్కిల్ పరిధిలో భారీగానే గణనాథులు కొలువుదీరారు. ముఖ్యంగా మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలో వందలాది మండపాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఇక నిమజ్జనం రోజు కూడా భారీగానే జనం ఊరేగింపులో పాల్గొనే అవకాశం ఉంది. దీని దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ఇప్పటికే మండపాల నిర్వాహకులకు సూచిస్తున్నారు.


పల్లెచెరువు వద్ద పోలీసుల పహారా


పల్లెచెరువుకు నిమజ్జనానికి తరలివెళ్తున్న భారీ గణనాథుడు

### పిల్లలు జాగ్రత్త..

ఉత్సాహంగా ఊరేగింపులతో గణనాథులను నిమజ్జనానికి పల్లెచెరువు, పత్తికుంట, లేదా జల్‌పల్లి పెద్దచెరువు(ఇబ్రహీంసాగర్)కు తరలిస్తారు. ఈ విషయంలో ఈతరాని వారు ప్రధానంగా చిన్నారులను చెరువుల వద్దకు తీసుకెళ్ల వద్దని పోలీసులు సూచిస్తున్నారు. తక్కువ లోతు వరకు మాత్రమే వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలి. లోతుగా ఉన్న ప్రాంతాలకు నిమజ్జనానికి సాధ్యమైనంత వరకు వెళ్లకూడదు. యువత నిమజ్జనం అనంతరం ఈతకు దిగకూడదు. ప్రధానంగా 10-15 బాలలను వారి తల్లిదండ్రులు కనిపెట్టుకొని ఉండాలి. లేదా అత్యుత్సాహంతో పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది.

### విద్యుత్తు తీగలతో ముప్పు..

వినాయక మండపాల ఏర్పాటులో లోటుపాట్లు పలుమార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మండలపాల వద్ద విద్యుత్తు పనులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తుంటారు. విద్యుత్తు శాఖ అనుమతి లేకుండా.. స్తంభాలకు తీగలను తగిలించి.. నాణ్యతలేని వైర్లతో అరకొర పనితనం ఉన్నవారితో పనులు చేయిస్తుంటారు. ఇది తొలుత బాగానే ఉన్నా.. భారీ వర్షాలు, గాలులు వీచినప్పుడు విద్యుదాఘాతానికి దారితీసే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే పలుచోట్ల ఇలాంటివి గుర్తించిన పోలీసులు.. వెంటనే విద్యుత్తు వైర్లను సరిచేసుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచిస్తున్నారు. స్తంభాలకు వేలాడతీస్తున్న తీగలతో నిమజ్జనం రోజు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భారీ వినాయకులు నిమజ్జనానికి తరలించే క్రమంలో వాటిని ఎత్తేందుకు యత్నించి ప్రమాదాల బారిన పడే అవకాశముంది. తక్కువ ఎత్తులో తీగలు ఉండకుండా చూడాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధానంగా వాహనానికి మైకులు, లైట్లు కోసం ఏర్పాటు చేసే జనరేటర్లు పెట్టేచోట అప్రమత్తంగానే ఉండాలని సూచిస్తున్నారు. ఊరేగింపుల వేళ రసాయనాలు కలిపిన రంగులు విపరీతంగా చల్లుకుంటారు. అవి కళ్లలో పడితే ప్రమాదకరం. మితంగా పూసుకోవాలి. మనకు తెలియని వ్యక్తులు, వాహనాలు, బస్సుల్లో వెళ్లే వారిపై రంగులు చల్లడం వల్ల వారు ఇబ్బందిపడే అవకాశముంది. ఇలాంటి విషయాల్లో కాస్త సంయమనం పాటించాలి.

### అప్రమత్తంగా ఉండాల్సిందే:

జగదీశ్వర్, సీఐ, మైలార్‌దేవుపల్లి

నిమజ్జన ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ పేర్కొన్నారు. నిమజ్జన ఉత్సవాల్లో జాగ్రత్తలతోపాటు మండపాల వద్ద ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్వాహకులకు ఇప్పటికే సూచించామన్నారు. మండపాలు, నిమజ్జన వివరాలను ఎప్పటికప్పుడు నిర్వాహకులు సమాచారం అందించాలని సూచించామన్నారు.

## దర్గాఖలీజ్‌ఖాన్ కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ


ప్రభుత్వ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ

నార్సింగి: కిస్మత్‌పూర్ గ్రామ పంచాయతీ దర్గాఖలీజ్‌ఖాన్ గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మధ్య అడ్డుగోడ నిర్మించడంతో పాటు ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించాలని ఎంపీపీ తలారిమల్లేష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఆయన మండల విద్యాశాఖ అధికారి భూపతిరావు, ఇంజినీరు అశోక్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీలు సురేశ్‌గౌడ్, అస్లంలతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులతో సమస్యలను తెలుసుకున్నారు.

## శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు షురూ..


ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచి

**నార్సింగి, న్యూస్‌టుడే:** గండిపేట మండలం కోకాపేట గ్రామ శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణానికి సర్పంచి మంజుల యాదగిరి సోమవారం శంకుస్థాపన చేశారు. పరిసరాలలోని చెత్త వచ్చి శ్మశానవాటికలో చేరుతుండటంతో అపరిశుభ్రంగా తయారవుతోంది. దీనిని నివారించడంతో పాటు భవిష్యత్తులో భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. నాయకులు విజయ్‌బాబు, హరిశంకర్, సురేశ్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, డి.చంద్రయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీలో సుధీ-2017 గోడపత్రిక ఆవిష్కరణ


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

**నార్సింగి, న్యూస్‌టుడే:** గండిపేట సీబీఐటీ కళాశాలలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం సెప్టెంబరు 15, 16 తేదీలలో నిర్వహిస్తున్నట్లు సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.పి.రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు రూపొందించిన గోడపత్రికను యాజమాన్య కమిటీ సభ్యురాలు వి.సంధ్యాశ్రీ తదితరులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెంది ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన వెయ్యి మంది ఈ రెండు రోజుల సింపోజియంలో పాల్గొంటున్నారన్నారు. యువ ఇంజినీర్లు అన్ని విభాగాల్లో తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. సుధీ-2017 ఛైర్మన్ డా.కె.జగన్నాథరావు, అధ్యాపకులు డా.సురేశ్‌బాబు, డా.బి.శ్రీదేవి, డా.బి.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో రహదారులపై మట్టి తొలగింపు

### ‘ఈనాడు కథనానికి స్పందన’


మట్టిని తొలగిస్తున్న కార్మికులు

శంషాబాద్ గ్రామీణ: శంషాబాద్‌లో రహదారులపై నిర్లక్ష్యంగా వదిలేసిన మట్టిని ఎట్టకేలకు సోమవారం అధికారులు తొలగించారు. స్థానికుల ఇబ్బందులు, వాహనచోదకుల తంటాలపై ఈనెల 28న ‘ఈనాడు’లో ‘తవ్వి వదిలేస్తున్నారు’ అన్న శీర్షిక వెలువడిన కథనానికి శంషాబాద్ గ్రామ సర్పంచి ఆర్.సిద్ధేశ్వర్, కార్యనిర్వహక అధికారి శ్యాంసుందర్ స్పందించారు. మధురానగర్ కాలనీలో అంతర్గత సీసీ రహదారిని నిర్మించిన గుత్తేదారు నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి మధ్యలో నిర్లక్ష్యంగా పోసిన మట్టిని వెంటనే తొలగించాలంటూ ఆదేశించడంతో గుత్తేదారు మట్టిని తొలగించారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## త్వరగా నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్లోని పత్తికుంటలో నిమజ్జనం నాటికి ఏర్పాట్లు పూర్తిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. సోమవారం సర్కిల్ అధికారులు, ఉత్సకమిటీ సభ్యులతో కలిసి పత్తికుంటను పరిశీలించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై నాలుగురోజులు పూర్తయినా.. నిమజ్జన ఏర్పాట్లు ఇంకా ప్రారంభంకాలేదని సర్కిల్ ఉత్సకమిటీ ఉపాధ్యక్షులు వై.శ్రీధర్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గత సమావేశంలో ఇక్కడ ఏటా ఎదురవుతున్న సమస్యలను వివరించినా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని అన్నారు. ఐదో రోజు నుంచి పెద్ద విగ్రహాల నిమజ్జనం ప్రారంభమవుతుందని అన్నారు. క్రేన్‌ను ఏర్పాటు చేయాలని సూచించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కాగా ఐదోరోజు నిమజ్జనానికి సంబంధించి సిబ్బందిని నియమించినట్లు ఉపకమిషనర్ విజయలక్ష్మీ చెప్పారు. 7వ రోజు నుంచి పత్తికుంటలో క్రేన్‌ను అందుబాటులో ఉంచుతామని అన్నారు. నాలుగోరోజు సాయంత్రం వరకు మొత్తం వెయ్యి చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు ఆమె ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. చెరువులోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉత్సవ కమిటీ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజు విగ్రహాలు క్రమపద్ధతిలో వచ్చి త్వరగా నిమజ్జనం అయ్యేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సర్కిల్ ఈఈ లచ్చిరాం, రాజేంద్రనగర్, అత్తాపూర్ కార్పొరేటర్ శ్రీలతామహత్మా, విజయాజంగయ్య, రఘుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

## జీవాల విక్రేతలతో సమావేశం

**మెహిదీపట్నం, న్యూస్‌టుడే:** బక్రీదు పండగ నేపథ్యంలో జీవాల విక్రేతలతో లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య సోమవారం సమావేశం అయ్యారు. పలువురు వ్యాపారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రింగురోడ్డు, టోలిచౌకి ప్రాంతాల్లో జీవాలు విక్రయించేందుకు అనుమతి ఉందని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నడుచుకోవాలని ఆయన కోరారు.

# రాజేంద్రనగర్

## తెదేపా నేతల సంబరాలు

**గోల్కొండ:** తెదేపా గెలుపుపై టోలిచౌకి డివిజన్ నాయకులు సోమవారం గోల్కొండ రేషమ్‌బాగ్‌లో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో అమ్జద్‌ఖాన్, డివిజన్ అధ్యక్షులు మహ్మద్‌ఖైరుద్దీన్, శ్రీనివాస్, జహంగీర్, ఓమర్, హాషిమ్, ఇమామ్‌లు పాల్గొన్నారు.

# 'గణ'మైన పూజలు



మట్టి గణేషుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

**కాటేదాన్, న్యూస్‌టుడే:** మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని పలు బస్తీల్లో గణనాథుడికి పూజలు కొనసాగుతున్నాయి. నేతాజీనగర్, గణేష్‌నగర్ బంగారు మైసమ్మ మండపం, లక్ష్మీగూడ, మధుబన్, పద్మశాలిపురం, తదితర బస్తీలోలని మండపాల్లో సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఈ ఏడాది ప్రాముఖ్యతనిచ్చామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మధుబన్, మైలార్‌దేవుపల్లి, ప్రగతికాలనీ, లక్ష్మీగూడ, బాబుల్‌రెడ్డినగర్ బస్తీల్లోని మండపాలను దర్శించుకున్నారు. తెరాస నేతలు తిరుమల వెంకటేష్‌గౌడ్, ప్రేమ్‌గౌడ్, తిమ్మయ్య, బుచ్చయ్య గుప్త, కాశిగారి యాదగిరి, బుచ్చిరెడ్డి, భాజపా నేతలు నవారు మురళీధర్‌రెడ్డి, నరసింహారాజు, అడికెరాజు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**మణికొండ:** గణేష్ నవరాత్రుల్లో భాగంగా మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. పుప్పాలగూడ శ్రీరామ్‌నగర్‌కాలనీలోని వినాయక మండపంలో నందు రియో భరతనాట్య అకాడమీ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భరతనాట్య ప్రదర్శనను సతీష్, ఉదయశ్రీల పర్యవేక్షణలో నిర్వహించారు.

● నెక్నాంపూర్ అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రత్యూష అపార్ట్‌మెంట్‌లోని మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నార్సింగి:** గండిపేట మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక నవరాత్రి పూజలు నాలుగో రోజు సోమవారం కొనసాగాయి. బండ్లగూడ ఆనందనగర్ కాలనీలో మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. హైదర్షాకోట్ శాంతినగర్ రోడ్డు నెం.3లో ఏర్పాటు చేసిన మండపంలో మట్టిగణపయ్యను భక్తులు నిత్యం పూజిస్తున్నారు. మండపం వద్ద మహిళలు తమ వాయనాలు అందిస్తుండగా, మరోవైపు చిన్నపిల్లలకు వివిధ విషయాలలో పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. సోమవారం మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీరంచెరువు వెస్టెండ్ కాలనీ, హిమగిరినగర్ తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాలలో ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు.



అత్తాపూర్‌లోని గణేషుడి వద్ద పూజల్లో మహిళలు



హైదర్షాకోట్ లక్ష్మీనర్సింహ కాలనీ మండపంలో పూజల్లో భక్తులు



పుప్పాలగూడ శ్రీరామ్‌నగర్‌కాలనీలో చిన్నారుల నృత్యం



బండ్లగూడ ఆనంద్‌నగర్ కాలనీలో..



మైలార్‌దేవుపల్లి బస్తీలో...



కాటేదాన్‌లో పూజల్లో పాల్గొన్న స్థానికులు



మైలార్‌దేవుపల్లిలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

### చెరువులో విగ్రహాల తొలగింపు

**మణికొండ:** నెక్నాంపూర్ చిన్నచెరువులో ఆదివారం జరిగిన వినాయక విగ్రహాల నిమజ్జనంతో పేరుకుపోయిన వ్యర్థాలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. సోమవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది చెరువులోని వినాయక విగ్రహాలను తొలగించి.. ట్రాక్టర్‌లో తరలించారు. చెరువులో పారబోసిన పూజాసామగ్రి వ్యర్థాలను తీసి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారంలోగా గ్రామపరిధిలో నిర్మితమవుతున్న నిమజ్జన కొలను అందుబాటులోకి రానుందన్నారు. అప్పటి వరకు చెరువులో జరిగే విగ్రహాల నిమజ్జనంతో పోగైన వ్యర్థాల తొలగింపును పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తారని తెలిపారు.



చిన్నచెరువులో వేసిన గణేష్ ప్రతిమలను తొలగిస్తున్న సిబ్బంది

## వాలీబాల్‌లో చిన్నగోల్కొండ విద్యార్థుల ప్రతిభ



గెలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో చిన్నగోల్కొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో క్రీడాకారుల అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 26, 27న రెండు రోజుల పాటు అండర్ 17 బాలుర, అండర్ 14 బాలికల విభాగంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నగోల్కొండ పాఠశాలకు విద్యార్థులు మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## హైటెన్షన్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనాలు

● ట్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**శంషాబాద్ గ్రామీణ:** అతి వేగంగా వెళుతున్న వాహనాలు అదుపు తప్పి హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన శంషాబాద్-షాబాద్ రహదారిపై సోమవారం చోటు చేసుకొంది. శంషాబాద్ నుంచి నర్కుడ వైపు మినీ వ్యాన్ అతివేగంగా దూసుకెళుతుంది. ఈ క్రమంలో అదుపు తప్పి హైటెన్షన్ స్తంభాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో శంషాబాద్ వస్తున్న మరో మినీవ్యాన్ డ్రైవర్ వేగాన్ని నియంత్రించే క్రమంలో అదుపు తప్పి విరిగిపోయిన స్తంభాన్ని ఢీకొట్టాడు. అదృష్టవశాత్తు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం చోటుచేసుకొంది. పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



ప్రమాదంలో కూలిన హైటెన్షన్ విద్యుత్తు స్తంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహారెడ్డి

## పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి: ఏసీపీ

**శంషాబాద్ గ్రామీణ:** గణేష్ నిమజ్జనం, బక్రీద్ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకొనేలా పరస్పరం ఒకరికొకరు సహకరించుకోవాలని ఆర్జీఐఏ ఏసీపీ ఎన్.నర్సింహారెడ్డి అన్నారు. ఆర్జీఐఏ ఠాణా సీఐ మహేశ్ అధ్యక్షతన సోమవారం అఖిల పక్ష నేతలు, మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మతాచారాలకు లోబడి చేసుకుంటున్న పర్వదినాలను గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. అసాంఘిక కార్యకలాపాలతోపాటు శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# EENADU CLASSIFIEDS

## JOBS

**హేచరీస్** & బ్రీడింగ్ పౌల్ట్రీఫామ్‌లో పనిచేయుటకు 2-3 Exp. సూపర్‌వైజర్‌లు కావలెను. Ph: 040-66629542, 9948094902

**హైదరాబాద్‌లోని ఇళ్లల్లో** 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

**సికింద్రాబాద్ కాల్‌సెంటర్** వెంటనే కావలెను. P/F టైం, డే/ నైట్ షిఫ్ట్స్, M/F వ: 18-30, మంచిజీతం. # 335, 3rd ఫ్లోర్, చంద్రలోక్ కాంప్లెక్స్, C-బ్లాక్, ప్యారడైస్ 9966342711.

SODEXO (MNC) కంపెనీ (హైటెక్‌సిటీ) లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్ HVAC కుక్స్ వెంటనే కావలెను. ✆ 7993865616/ 7331139558

**రిటైర్మెంట్ ఆఫీసర్స్‌కు** & నిరుద్యోగులకు శుభవార్త! మీ ఇంటివద్దనే ఉంటూ పార్ట్/ఫుల్ టైం పనిచేస్తూ నెలకు అధిక ఆదాయం సంపాదించండి. ✆ 7075998062/ 9704612279.

**ప్రముఖ ఇంజనీరింగ్/** కార్పొరేట్ సంస్థలకు B.Tech/ డిప్లొమా- Mech/ EEE/ ECE వారు ప్రొడక్షన్/ మెయింటెనెన్స్/ SSC to PG వారు అకౌంటెంట్లు, మేనేజర్లు, అడ్మినిస్ట్రేటర్లు, క్యాషియర్లు, కంప్యూటర్/ డేటా ఎంట్రీ ఆ॥ర్లు. స్టోరు సూ॥ర్లు, టెలికాలర్లు Exp: 0 to 30 Yrs. జీ॥ 10K to 70K. 7337410067/ 9177918952, 8374392002

**5&3 స్టార్‌హోటల్స్‌లో** క్యాటరింగ్ బాయ్స్/ గర్ల్స్ కావలెను. గర్ల్స్ 600 - 1200, బాయ్స్ 400 - 800 P/F టైం రూం+ మీల్స్, స్పాట్ పేమెంట్స్ ✆ 8187872321/ 7995280048

**ప్రముఖ Pvt.** Ltd కం॥లో MBA మార్కెటింగ్ చేసిన యువకులు కావలెను. గుడ్ సాలరీ+ అలెవెన్స్. నాగోల్ 'x' రోడ్ varaboomi@gmail.com ✆ 9394662727

**ప్రముఖ రియల్‌ఎస్టేట్** కంపెనీకి డిగ్రీ to P.G, Female Tele Callers కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ+ బస్‌పాస్+ ఇన్సెంటివ్, మౌలాలి, H.B. కాలనీ, ✆ 9154203314/ 7075218061

**మణికొండలోని హోటల్‌కు** Aged/ రిటైర్డ్ క్యాషియర్స్ (ఫ్రెషర్స్ కూడా సంప్ర) స్టాల్ బాయ్స్, సూపర్‌వైజర్స్, హౌజ్ కీపింగ్ బాయ్స్ రుబ్బింగ్‌మాస్టర్లు, కెప్టెన్స్ కావలెను. ✆ 9704765668.

**స్పాట్‌జాయినింగ్, జీతం:** 18,000/- అర్జంటుగా ప్రముఖ ఏజెన్సీలకై 300 ఖాళీ పోస్టులకై M/F స్టాఫ్, P/F టైం, ఆల్ ఏరియాస్. Q: 10th - P.G, Age: 18-35Y, Ph: 8897511523

**సేల్స్ గర్ల్స్** కావలెను: దిల్‌సుఖ్‌నగర్‌లో బేకరిలో పని చేయుటకు సేల్స్ గర్ల్స్ కావలెను. నెలకు జీతం రూ॥ 6,500/- వెంటనే సంప్ర నం॥ 7799632253

**డైరెక్ట్ జాబ్.** స్పాట్ జాయినింగ్. ప్రముఖ Ltd కం॥లో హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్, సూ॥వైజర్స్, ఆఫీస్ బాయ్స్, ITI (ఆల్) కావలెను. జీ: 11-17 వేలు, ఫ్రీ రూం, మీల్స్, చదువులేకున్నా జాబ్. ✆ 9705874656

**ప్రముఖ రియల్‌ఎస్టేట్** సంస్థలో టెలికాలింగ్ చేయుటకు, చక్కగా మాట్లాడగల యువతులు కావలెను. జీతం 7 వేలు (నో టార్గెట్) + ఇన్సెంటివ్స్ & మార్కెటింగ్ డోర్ టు డోర్ బాయ్స్ కావలెను. SR నగర్ Ph: 8885262727.

**ప్రముఖ రియల్** ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన లేడి రిసెప్షనిస్ట్ కావలెను ✆ 7702838071

**డైరెక్ట్ జాబ్:** ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ చేయుటకు DE: 20 లేడీ టెలికాలర్స్ 8 కావలెను. 30K P.M Q: 10th to P.G. ✆ 9392832244/ 9392932244

## MARKETING / SALES

**Wanted Male/** Female Marketing Executives Salary 10K to 20K + Incentives. Walk-In at S.R.Nagar. Contact: 8885099905

**Wanted Field** Executives For product Demo Marketing & Sales Trainee Freshers ITC Engg Begumpet ✆ 9246501672/ 27760387

## FACULTY / TEACHERS

**English Speaking** Primary, High School Teachers All Subjects Contact: Fern Hills High School, Asmangadh Malakpet, Ph: 9160692840

**Lady Teachers** with Good Communication for Nursery To 7th Class at Science Park School, Upperpally, Near: Attapur. Ph: 9849453977/ 9652192180.

**Amithabha Aadarana** Vidhyalaya Wanted Teachers Sub: Social, Hindi, English, Science @L.B.Nagar ✆ 9652831083/ 9346005469

**Wanted Teachers**- Tilaknagar BR. Higher- English & Primary Teachers Who Can Teach All Subjects & Pre- Primary & Karmanghat BR. Higher Maths & Primary Teachers Who Can Teach All Subjects ✆ 7093138863, 7799875757

**Wanted Lecturers** to Teach M.S.C Organic Chemistry, M.S.C Genetics, M.Com and M.A. English Courses, at MNR PG College, Kukatpally, Hyd. And A Lab Technician for Genetics Lab. Send Resumes to Email:mnrpgcourses@gmail.com Mob: 9849981068

**Wanted Teachers** for Primary & High School Physics, Maths, EVS, Telugu & Incharges @ ERRAGADDA Ph: 9010291654/ 9291224336

## DRIVERS

**Wanted Driver** with Badge Number 12 Hrs Duty 15k Salary with Incentive's No Target (For Company & OLA/ UBER) Call: 9030016119/ 15

**Wanted 3** & 4 Wheelers Commercial Vehicles Drivers with Batch No. License Holders ✆ 9000132255/ 27423603/ 27424183.

**కేవలం 20** నెలల్లో Verito Cabను స్వంతం చేసుకోండి. ముందస్తు చెల్లింపు లేకుండానే, షరతులు వర్తిస్తాయి. 40520197/ 7675909909.

**డ్రైవర్లు కావలెను.** ఇంటి కార్లపై డ్యూటీ కొరకు హైదరాబాద్ అన్ని ఏరియాలలో 3 సం॥ల అనుభవం జీ॥ 11000/- నుండి 13000/- 9030266688/ 9030266644

## ACCOUNTING

**Wanted Accountant** M/F Exp in Pharma Company. Work at Saltire Remedies Pvt Ltd. D.D Colony, Bagh Amberpet, Hyd. 9000041841/ 040- 27420091.

## CATERING

**నల్లగొండ పట్టణంలోని** రెస్టారెంట్ నందు పనిచేయుటకు ఇండియన్, చైనీస్, తందూరి మాస్టర్స్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. ✆ 90525 66638.

## ENGINEERING

**Wanted Sr** Engineer Having Exp Above 4yrs Who Can Handle The Project Independently Ph: 8897489367, 8639510467.

## MEDICAL

**Wanted Female** & Male GNM, ANM, Experienced for Shift Duties at Hospital in Masab Tank Contact: 9848027002

**Receptionist/ Tele-Callers/** Billing Clerk wanted for our 2 Day Care Clinics at KPHB & Punjagutta. Good Salary ✆ 8121298298. jobs.dbsh@gmail.com

**లేడిడ్యూటీ డాక్టర్‌కావలెను.** MBBS/BAMS / BHMS @ గ్రీన్‌లీఫ్ హెల్త్‌సెంటర్ వివేకానందనగర్‌కాలనీ, కూకట్‌పల్లి. ✆ 9000124411

**Dentist & Helper** కావలెను శ్రీరామ డెంటల్ హాస్పిటల్, రోడ్ నెం: 4, కె పి. హెచ్. బి, కళాంజలి ప్రక్కన. Ph: 9948943535

## SECURITY GUARDS

**Wanted Freshers** Security Guards for Hyd & Sec-Bad. Q: 10-Inter, Sal: 9K-15K & ESI+ PF+ Pension. ZV Consultancy, 040- 23563457/ 9063293457

**బోయినపల్లి, బంజారాహిల్స్,** మేడ్చల్‌లో సెక్యూరిటి గార్డ్స్ (జీ: 10వేలు) అనుభవం కల్గిన ఫీల్డ్ ఆఫీసర్స్ (జీ: 13వేలు) అర్జంటుగా కావలెను. Ph: 9666066055/ 9010906111/ 65555711

**సెక్యూరిటీ సూపర్‌వైజర్స్,** ఇంటర్/ డిగ్రీ: గార్డ్స్, SSC, 21-37 వయస్సు 5'8" ఎత్తు, మంచి దేహదారుఢ్యము కలవారు ప్రముఖ వాణిజ్య సంస్థకై తెల్లాపూర్ (బి. హెచ్. ఇ. ఎల్.) మరియు శ్రీనగర్ కాలనీ (పంజాగుట్ట) వద్ద పనిచేయుటకు కావలెను. బ్యాచిలర్స్‌కు ఉచిత వసతి. ఆకర్షణీయమైన జీతము, పి. ఎఫ్. ఇ. యస్. ఐ., బోనస్ & ఇన్సెంటీవ్స్ కలవు. అర్హులైన వారు వెంటనే 9963640077, 9010000750 నెంబర్లలో సంప్రదించగలరు.

## TOURS & TRAVELS

**దసరాకి ఒరిస్సా** 5 రోజుల AC యాత్ర సెప్టెంబర్ 26న పూరి, కోణార్క్, భువనేశ్వర్, గిరిజాదేవి శక్తి పీఠం, అన్నవరం, తలుపులమ్మ లోవ, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, పిఠాపురం, ద్రాక్షారామం, ద్వారకాతిరుమల. లక్ష్మీటూర్స్. ✆ 98662 46466.

**కావేరిపుష్కరాలు, మొదటిరోజు** శ్రీరంగపట్నంలో స్నానమాచరించే గోవా & కర్ణాటక 20 క్షేత్రాల AC యాత్ర Sep 4న & తమిళనాడు శ్రీరంగంలో పుష్కర స్నానమాచరించే రామేశ్వరం 30 క్షేత్రాల AC యాత్ర Sep 15న. ✆ 98662 46466.

**కావేరిపుష్కరాలు, శ్రీరంగం,** మైసూర్, శృంగేరి, గోకర్ణం,మూకాంబిక 7 రో॥ 7200/-10-9 & 15-9 ★ కాశిమినిటూర్,కాశి,ప్రయాగ. 3రో॥ వ॥ భో॥ 3000/- sep-4 సత్యసాయి సేవాసమాజ్ 9618933189.

**సహస్ర టూర్స్** కావేరి పుష్కర యాత్ర (ప్రతిరోజు) శ్రీరంగపట్నం (కర్ణాటక) 5 క్షేత్రాలు 3రో॥ మనిషికి రూ॥ 8,500/- గంగాసాగర్ - కామాఖ్య 19/11-12 రో॥ ✆ 7993478851/2/3

**కావేరీ పుష్కర** స్పెషల్ కర్ణాటక యాత్రలు: I 8/9 గోకర్ణం; మొ॥ 18 క్షే॥ 8 రో॥ II 16/9 హంపి; మొ॥ 6 క్షే॥ 4 రో॥ అక్టోబర్‌లో కాశీ, నేపాల్, ముక్తినాథ్ 12 రో॥ 9 క్షే॥ శాస్త్రీ Ph: 7382006226.

**సాయిటూర్స్: మహారాష్ట్ర:** షిరిడి, భీమశంకర్, అష్టగణపతులు, Oct-5, రూ॥ 9000/- ★ కేరళ: గురువాయర్, కోచ్చిన్, త్రివేంద్రం, మున్నర్ రూ॥ 85000/- Oct-13 భో+ వ ✆ 9848664831

## గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



# బాబోయ్.. నిర్వహణ మావల్ల కాదు!

● డిగ్రీ కళాశాలల్లో భర్తీ కాని సీట్లు
● యాజమాన్యాల ఆందోళన



ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో కనీసం 50 శాతం మంది విద్యార్థులు లేకుండా నడపడం తమవల్ల కాదని ఆయా కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. నాలుగు విడతల్లో సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టినా ఇప్పటివరకు చాలా కళాశాలల్లో కనీసం 25శాతం కూడా భర్తీ కాలేదు. తక్కువ సంఖ్యలో ఉన్న అభ్యర్థులతో తరగతులు ఎలా నిర్వహించాలని వారు ప్రశ్నిస్తున్నారు. దోస్తు కార్యక్రమం పేరుతో ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియను ప్రవేశపెట్టి ఫీజులను నిర్ణయించిన విషయం తెలిసిందే. విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు దీనిపట్ల ఆసక్తి చూపలేదు. తమకు అవగాహన లేదని వారు వివరిస్తున్నారు. చాలా మంది అభ్యర్థులు నెట్ సెంటర్లను ఆశ్రయించి కళాశాలలను ఎంపిక చేసుకున్నారు. మూడు విడత కౌన్సెలింగ్‌లలో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిక చేసుకున్న కళాశాలలో సీటు వచ్చినట్లే వచ్చి చేజారిందని వాపోయారు. దీంతో అధికారులు స్పందించారు. మరోవిడత కళాశాలల ఎంపికకు అవకాశం కల్పించారు. అయితే మూడు విడతల్లో నమోదు చేసుకున్నవారికి మాత్రమే నాలుగో దఫా అవకాశమిచ్చారు. గ్రేటర్ పరిధిలో చాలా డిగ్రీ సీట్లు భర్తీ కాని నేపథ్యంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు కోరుతున్నాయి.

స్పందన కరవు.. డిగ్రీ కళాశాలలను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకొనేందుకు ఇచ్చిన అవకాశాన్ని తక్కువమంది మాత్రమే వినియోగించుకుంటున్నారు. మూడో విడతలో అన్యాయం జరిగిందని పేర్కొన్న వారు దాదాపు 3వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో సోమవారం వరకు చాలామంది నాలుగో విడత వెబ్‌ఆప్షన్లలో ఐచ్ఛికాన్ని నమోదు చేసుకోలేదు. 29వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నా విద్యార్థుల నుంచి కనీస స్పందన లేకపోవడం కళాశాలలను కలవరపరుస్తోంది. మూడో విడత కౌన్సెలింగ్‌లో నచ్చిన కళాశాల వచ్చినా ప్రస్తుతం మళ్లీ ఆ కళాశాలలో సీట్లు నిండిపోయినట్లు చూపిస్తోందని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కొత్త కళాశాలను ఎంపిక చేసుకోవాల్సి వస్తోందని, అలా కాకుండా తమకు కేటాయించిన కళాశాలలోనే ఇవ్వాలని కోరుతున్నారు. ఇదే అంశంపై సోమవారం మాసాబ్‌ట్యాంక్ సమీపంలోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఇప్పటివరకు నమోదు చేసుకోని కొత్తవారికి కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరితో అధికారులు చర్చలు జరిపారు. అదే సమయంలో ఆసక్తి ఉన్న విద్యార్థులందరికీ సీట్లు ఇవ్వాలని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.

## భారతీయ పర్యాటకులు పెరుగుతున్నారు

ఇజ్రాయెల్ పర్యాటక శాఖ డైరెక్టర్ హసన్ మదా

జూబ్లీహిల్స్: ఇజ్రాయెల్‌కు వచ్చే భారతీయ పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోందని ఆ దేశ పర్యాటక శాఖ డైరెక్టర్ హసన్ మదా అన్నారు. ఇజ్రాయెల్‌కు పర్యాటకులను ఆకర్షించేందుకు భారత్‌లోని ఆరు నగరాల్లో ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు ఇజ్రాయెల్ పర్యాటక మంత్రిత్వ శాఖ తమ రెండో రోడ్‌షోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 21న ప్రారంభమైన ఈ రోడ్ షో దిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల మీదుగా కొనసాగుతుందన్నారు. గత ఏడు నెలల్లో దాదాపు 34 వేల మంది భారతీయులు ఇజ్రాయెల్‌ను సందర్శించారన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 36 శాతం వృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రధాని మోదీ పర్యటనతో ఇజ్రాయెల్ పట్ల భారతీయులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు.



భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో స్ఫూర్తి థియేటర్ ఫర్ ఎడ్యుకేషనల్ పప్పెట్రీ, ఆర్ట్, క్రాఫ్ట్ (ఎస్‌టీఇపీఏఆర్‌సీ) ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో 'శ్రీరామానుజ వైభవం' పేరిట కొయ్య, తోలుబొమ్మలాట ప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, రవీంద్రభారతి

## రైతు కమిటీల ఏర్పాటుపై మంత్రి సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సెప్టెంబరు 9 నాటికి రైతు కమిటీల ఏర్పాటుపై మంత్రి మహేందర్‌రెడ్డి సోమవారం నగరంలోని తన నివాసంలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సర్వే కోసం గ్రామస్థాయిలో 12 మంది, మండల, జిల్లా స్థాయిలో 24 మంది రైతులతో జిల్లాల్లో రైతు సమాఖ్యల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఎమ్మెల్యేలు వివేకానంద, యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అంజయ్యయాదవ్, కిషన్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, సంజీవరావు, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నరేందర్‌రెడ్డి, యాదవ్‌రెడ్డి, నారాయణరెడ్డి, టీఎస్ డబ్ల్యుఈఐఎస్ ఛైర్మన్ నాగేందర్‌గౌడ్, గురునాధరెడ్డి, జైపాల్‌యాదవ్, హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు సమన్వయ సమితిలో అందరికీ ప్రాతినిధ్యం'

నల్లకుంట, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ఏర్పాటు చేసే సమన్వయ సమితిలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడారు. రైతు సమన్వయ సమితి పేరుతో ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో తెరాస కార్యకర్తలకు పదవులు కట్టబెట్టాలనే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకూ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త డాక్టర్ ర్యాగ అరుణ్, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, నేతలు శారదాగౌడ్, నీలవెంకటేష్, సీఎం. యాదవ్, నర్సింహాగౌడ్, నందగోపాల్, గౌరిగెమల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## మింట్ కాంపౌండ్‌లో మహా నిరాహారదీక్ష నేడు

ఖైరతాబాద్: తెలంగాణ విద్యుత్తు సంస్థలో మన ఉద్యోగాలు, మన పదోన్నతులు, మన ఆస్తులు నినాదంతో ఉద్యోగులు మహా నిరాహారదీక్ష చేపడుతున్నారు. ఈ నెల 29న ఉదయం నుంచి సాయంత్రం వరకు మింట్‌కాంపౌండ్‌లోని ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్స్ అసోసియేషన్, విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, టీ అండ్ జీ అసోసియేషన్, తెలంగాణ సహాయ ఇంజినీర్ల సంఘం సంయుక్తంగా మహా నిరాహారదీక్ష చేపడుతున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు శివాజీ, అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ తెలంగాణ విద్యుత్తు సంస్థల్లో సీమాంధ్ర ఉద్యోగుల ఆధిపత్యం కొనసాగుతోందని, ఇందుకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలో ఐదొందల మంది ఉద్యోగులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## గౌరవంగా తినే స్థితేది!



పాతబస్తీ లాల్‌దర్వాజ నెహ్రూ విగ్రహం వద్ద బురద నీటిలో నిల్చొని రూ.5 భోజనాన్ని తింటున్న పేదలు. తక్కువ ఖరీదు అన్నమైనా గౌరవంగా తినే సదుపాయాలు కల్పించండి. –కె.వెంకటేశ్, లాల్‌దర్వాజ

## విమానాల్నీ తీయగలవు!




ఈ కెమెరాలు వాహనాల్ని కాదు... ఆకాశంలో విమానాల్ని చిత్రీకరిస్తాయి. ఎందుకంటే ఇక్కడ స్తంభం ఒరిగి కొంతకాలంగా కెమెరాలు ఆకాశాన్ని చూస్తున్నాయి కనుక. –మహ్మద్, గచ్చిబౌలి

## ఈ చీకట్లు తొలగవా?



ఉప్పల్-రామంతాపూర్ ప్రధాన రహదారిపై మోడరన్ బేకరీ వద్ద చిమ్మచీకట్లు. చాలాకాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించడం లేదు.–కె.రాఘవేంద్ర, మణికొండ

## క్రేన్ వస్తేనే బయటకు..



మూసాపేట గాంధీపార్కు వెనుక భవానీ నగర్‌లో డ్రైనేజీ కోసం గుంతలు తవ్వారు. సగం పనులు చేసి వదిలేశారు. వాటిలో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. క్రేన్లు తెప్పించి తీయాల్సి వస్తోంది. –పి.రాజ్‌కిరణ్, మూసాపేట

## బైకు రిక్షా... భలే



సృజనకు హద్దేముంటుంది? నాగోలు వద్ద కనిపించిన సరికొత్త పల్సర్ రిక్షా. –టి.కల్పన, నాగోలు

## ప్రమాదం మరింత పైకి..



అసలే రద్దీ ట్రాఫిక్... ఆపై ప్రమాదకరంగా ఆటోపై ప్రయాణం. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద కనిపించిన దృశ్యం. –నరేశ్ కొయ్య, జూబ్లీహిల్స్

**పౌర పాత్రికేయం**

వాట్సాప్ నంబరు: **8008001763**

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? మీ పేరు, ప్రాంతం తదితర వివరాలతో వాటిని మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.

## పచ్చ'ధనం' కనువిందు



పచ్చదనం పందిరి వేసింది. వర్షాల వేళ... మా అపార్ట్‌మెంట్ పైనుంచి చూస్తే నాచారంలో పచ్చటి చెట్లు ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. –రాజా నాయక్, హెచ్ఎంటీ నగర్, నాచారం

## చిన్న రోడ్డు... పెద్ద కష్టం



ప్రగతి నగర్ రోడ్ ఆదిత్యనగర్ హైటెన్షన్ లైన్ రోడ్ నుంచి నిజాంపేట రోడ్డు చాలా ఇబ్బందిగా ఉంది. ఆ కొద్ది దూరం రోడ్డు వేస్తే వాహనాల రాకపోకలకు చాలా ప్రయోజనం. –కృష్ణ, సమతానగర్, కూకట్‌పల్లి



మియాపూర్ చౌరస్తా వద్ద రద్దీ ట్రాఫిక్‌లో ప్రమాదకరంగా భారీ పరికరాన్ని తరలిస్తున్న ట్రాలీ వాహనం. –రమాకాంత్, మియాపూర్

# ముగిసిన జెన్‌కో సెక్యూరిటీ గార్డుల శిక్షణ



శిక్షణలో ప్రతిభావంతులకు ధ్రువపత్రాలు అందిస్తున్న కమాండెంట్ సత్యనారాయణ

**గచ్చిబౌలి న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర జెన్‌కో సెక్యూరిటీ గార్డులకు కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ పటాలంలో నిర్వహించిన మూడునెలల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం పటాలంలో పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించారు. శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభచూపిన సిబ్బందికి పటాలం కమాండెంట్ సత్యనారాయణ బహుమతులను అందజేశారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ క్రమశిక్షణ పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జెన్‌కో విజిలెన్స్ విభాగం డిప్యూటీ సెక్రెటరీ సుజాత, పటాలం అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, శిక్షకులు వి.రాము, ఎస్.రవిచంద్ర, ఆర్ఐ కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

# శిథిల పాఠశాల భవనాల కూల్చివేతకు ఆదేశం

**కీసర, న్యూస్‌టుడే:** శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన పాఠశాలల భవనాలను వెంటనే కూల్చివేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి ఆదేశించారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 63 పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, ఇందులో 37 జీహెచ్ఎంసీ పరిధిలో.. 26 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. వర్షాకాలంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల పరిశుభ్రతకు సెప్టెంబరు 1 నుంచి 15 వరకు స్వచ్ఛ పకువాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. రైతు సమన్వయ కమిటీల ఏర్పాటుపై ప్రజాప్రతినిధులతో ఈనెల 30న మంత్రి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంసద్ ఆదర్శ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎం.వి.రెడ్డి

గ్రామీణ్ యోజన పథకం కింద ఎంపీలు ఎంపిక చేసుకున్న దుండిగల్‌లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, ఇందుకు బుధవారంలోగా ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. డీఆర్ఓ సురేందర్‌రావు, డీపీఓ సురేష్‌మోహన్, డీఆర్‌డీఏ పీడీ కౌటిల్య, సీపీఓ సౌమ్య, డీఈఓ ఉషారాణి పాల్గొన్నారు.



- రూ.22కోట్లు తీసుకొచ్చిన 'మినహాయింపు'
- సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో ట్రాఫిక్ విభాగానికి ఊరట
- రాణిగంజ్.. మలక్‌పేట ఆర్వోబీల పనులకు ఎన్‌హెచ్ఏఐ నిధులు

# మారిన మార్గదర్శకం.. మారనున్న మార్గాలు

ఈనాడు, హైదరాబాద్

చిన్న మినహాయింపు... ట్రాఫిక్ విభాగానికి పెద్ద ఊరట కల్పించింది. ఏకంగా రూ.22కోట్ల నిధులను తెచ్చిపెట్టింది. ఈ నిధుల ద్వారా ట్రాఫిక్ చిక్కులకు చిరునామాలుగా మారిన మలక్‌పేట రైల్వేస్టేషన్... రాణిగంజ్ రైల్వేఓవర్‌బ్రిడ్జిల వద్ద కొత్తగా విస్తరణ పనులు చేపట్టనున్నారు. నగరమంతా ప్రభావితమయ్యే ఈ రెండు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. దీంతో రాణిగంజ్.. మలక్‌పేట రైల్వే ఓవర్ బ్రిడ్జిల వద్ద కొత్తగా వెంట్(రాకపోకల ద్వారం)లను నిర్మించాలనుకున్నారు. కీలక అడ్డంకులుగా మారిన రెండు ఆటంకాలను ట్రాఫిక్ పోలీస్ అధికారులు తొలగించనున్నారు. వాస్తవానికి ఏడాదిన్నర క్రితం పోలీస్ ఉన్నతాధికారులకు ఈ ఆలోచన వచ్చింది. రైల్వే అధికారులకు విషయాన్ని వివరిస్తే తమకేం అభ్యంతరం లేదని, నిధులు కేటాయిస్తే తామే నిర్మించి ఇస్తామని వివరించారు. ఈ రెండు ప్రాంతాలూ జాతీయ రహదారులపై ఉండడంతో పోలీస్ అధికారులు వారిని సంప్రదించారు. అనంతరం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విషయాన్ని వివరించగా... ఆయన వెంటనే స్పందించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించి జాతీయ రహదారుల విభాగం అధికారులను నిధులు కేటాయించాలని ఆదేశించారు. ప్రయత్నాలు జరుగుతుండగా.. జాతీయ రహదారులపై మద్యం దుకాణాల అంశంపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆబ్కారీ ఆదాయం కోల్పోతుందని భావించి మలక్‌పేట, రాణిగంజ్‌లు జాతీయ రహదారులపై ఉండడంతో డీనోటిఫై చేయాలని నిర్ణయించింది. దీంతో ఈ రెండు ప్రాంతాలూ తమ పరిధిలోకి రావంటూ నిధులను ఉపసంహరించుకున్నారు. సుప్రీంకోర్టు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ఈ ఉత్తర్వులు వర్తింబోవంటూ తాజాగా మార్గదర్శకాలను జారీ చేయడంతో రూ.22కోట్లు తిరిగిరానున్నాయి.

## దశబ్దాలుగా ట్రాఫిక్ యాతన... కొత్త వెంట్‌తో ఉపశమనం

జాతీయ రహదారిపై ఉన్న మలక్‌పేట రైల్వేఓవర్ బ్రిడ్జి వద్ద దశాబ్దాల తరబడి ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారి సంస్థ అధికారులు పనులు చేస్తున్నా ఫలితాలు కనిపించడంలేదు. దీంతో కొన్నేళ్ల క్రితం అక్కడ ట్రాఫిక్ చిక్కులు తగ్గించేందుకు నల్గొండచౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించారు. ఫ్లైఓవర్ ఉన్నా సరే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడం లేదు. ఇక వర్షాకాలంలో అక్కడ పరిస్థితి దయనీయంగా ఉంటోంది. వర్షం కురిస్తే చాలు... వంతెన కిందంతా నీళ్లే. అమీర్‌పేట వైపు నుంచి దిల్‌సుఖ్‌నగర్.. ఎల్బీనగర్‌వైపు వెళ్లే వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటునే రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతోపాటు గత ఆరునెలలుగా మెట్రోరైల్ పనుల కారణంగా రహదారి మరింత ఇరుకుగా మారడంతో నిత్యం ప్రయాణం చేసేవారు ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జాతీయ రహదారి విభాగం ఇవ్వనున్న రూ.10 కోట్లతో మలక్‌పేట ఆర్వోబీ సమీపంలో కొత్తగా వెంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. రైల్వేశాఖ సాధ్యమైనంత వేగంగా నిర్మాణాన్ని పూర్తిచేయనుంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కొలిక్కి వచ్చినందున నిర్మాణపు పనులు మొదలు పెట్టడమేనని ట్రాఫిక్ డీసీపీ ఎ.వి.రంగనాథ్ తెలిపారు. స్థలసేకరణ కూడా లేనందున పనులు వేగవంతంగా కొనసాగనున్నాయని వివరించారు.

## రెండు చిన్న ద్వారాలు.. రూ.12 కోట్లు

రాణిగంజ్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద ఆదివారాలు మినహాయిస్తే... రోజూ ట్రాఫిక్ రద్దీనే.. దీంతోపాటు అక్కడ నిత్యం మురుగు ప్రవహిస్తూనే ఉంటోంది. దీంతో ట్యాంక్‌బండ్ నుంచి వచ్చే వాహనాలు, ప్యారడైజ్ నుంచి వచ్చే వాహనచోదకులు రోజూ అగచాట్లు పడుతున్నారు. ఉదయం ఒక్కసారిగా ఇక్కడ ట్రాఫిక్ స్తంభించి పోతే... కనీసం గంటసేపైనా సాధారణ స్థితికి రాదు. ఈ రహదారి గుండా ఎక్కువగా సిటీబస్సులు, కార్లు, ఆటోలు రాకపోకలు కొనసాగిస్తుండంతో ఎంజీబీఎస్ నుంచి మెదక్, తూప్రాన్, నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ఆర్టీసీ, కర్ణాటక, మహారాష్ట్ర బస్సులు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు రెండు ప్రవేశ ద్వారాలను తెరవాలని ప్రతిపాదించారు. ఒక్కో వెంట్‌కు రూ.6కోట్ల చొప్పున నిధులు అవసరమవుతాయని రైల్వే అధికారులు అంచనాలు రూపొందించారు. ఆరునెలల నుంచి ఏడాదిలోపు నిర్మాణం పూర్తిచేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారుల విభాగం అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే పనులను ప్రారంభించనున్నారు. పనులు వేగవంతం చేసేందుకు అవసరమైతే రాత్రివేళల్లో పనులు చేయనున్నారు. ఈ రెండు ద్వారాలను అందుబాటులోకి తీసుకువస్తే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని, పోలీస్ అధికారులు వివరించారు.



మదీనాగూడ వద్ద ఆక్రమణకి గురైన నాలాని పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ సందీప్‌శాండిల్య

# మదీనాగూడ నాలాను పరిశీలించిన సీపీ

- నాలా ఆక్రమణలపై విచారణకి ఆదేశాలు

**మియాపూర్, న్యూస్‌టుడే:** మదీనగూడ దీప్తిశ్రీనగర్‌లో ముంపునకు గురైన ప్రాంతంతో పాటు సెల్లార్ కారణంగా రిటైర్నింగ్ వాల్ కూలిపోవడంతో ఓ అపార్టుమెంట్ ప్రమాదం బారిన పడిన ప్రాంతాన్ని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్‌శాండిల్యా సోమవారం పరిశీలించారు. ప్రధానంగా మదీనాగూడ ప్రాంతం నుంచి వచ్చి జాతీయరహదారి మీదగా దీప్తిశ్రీనగర్ వద్ద ప్రధాన నాలాలో కలిసే నాలా ఆక్రమణపై ఆయన స్థానిక పోలీసులని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆక్రమణలకి సంబంధించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, పక్కనే ఉన్న సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌వాసులకు ఎలాంటి ప్రమాదం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. వివాదస్పదంగా మారిన సెల్లార్, ఇక్కడ నాలా అక్రమణలని ఆయన పరిశీలించారు. మదీనాగూడ నుంచి దీప్తిశ్రీనగర్‌కి వచ్చే నాలాకి సంబంధించి పూర్తి వివరాలు తీసుకోవాలని, నాలా ఆక్రమణలు, అనుమతుల విషయంపై విచారించాలని మియాపూర్ ఏసీపీ రవికుమార్‌కి సూచించారు. మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని, అవసరమైతే అక్రమంగా అనుమతులు మంజూరుచేసిన అధికారులపైనా కేసులు నమోదుచేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని సీపీ చెప్పారు. ఈ నాలాను మలుపు తిప్పారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరుమలఇన్‌ఫ్రా సంస్థపై కేసు నమోదుచేసినట్లు మియాపూర్ సీఐ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. పరిశీలనలో ఎస్ఐలు అప్పారావు, రఘురాం, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్, వెటర్నరీ, ఉద్యాన కోర్సుల్లో కౌన్సెలింగ్ ప్రారంభం



ప్రవేశ పత్రం అంజేస్తున్న అధికారులు

**రాజేంద్రనగర్, న్యూస్‌టుడే:** అగ్రికల్చర్, వెటర్నరీ, ఉద్యాన డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీవీఎస్సీ, బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులలో ప్రవేశాలకు సంయుక్తంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగుతున్న ఈ కౌన్సెలింగ్‌ను వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్ ప్రారంభించారు. తెలంగాణ ఎంసెట్ 2017లో 308వ ర్యాంకు సాధించి రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో ప్రవేశం పొందిన జి.అనూషకు రిజిస్ట్రార్ ప్రవేశపత్రం అందజేశారు. అలాగే 310వ ర్యాంకు సాధించిన ప్రసాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ప్రవేశం పొందాడు. వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కొండల్‌రెడ్డి ప్రవేశపత్రం అందజేశారు. 320వ ర్యాంకు సాధించిన వినీత్‌కుమార్ రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో ప్రవేశం పొందారు. ప్రవేశపత్రాన్ని ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు.. ఆందోళనకు మద్దతు

**బషీర్‌బాగ్, న్యూస్‌టుడే:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం వెల్లడించింది. 1న నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షులు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్, ముఖ్య సలహాదారులు కె.గంగాధర్, అసోసియేట్ అధ్యక్షులు షేక్ హుస్సేన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులను తెలంగాణ రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మూడు జిల్లాల్లో 3.10 కోట్ల చేప పిల్లల పంపిణీ ● అవగాహన సదస్సులో మంత్రి మహేందర్‌రెడ్డి




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో రూ.1000 కోట్లతో మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం వైష్ణవి గార్డెన్‌లో రంగారెడ్డి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత చేపపిల్లల సరఫరాపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు చినంగి వెంకటేశం ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఈ యేడాది రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చెల్ జిల్లాలకు 3.10కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1350 చెరువులు, కుంటలను రూ.450కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు దిండి ద్వారా, తాండూరుకు పాలమూరు ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శాసనసభ్యుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మిషన్ కాకతీయ కింద రూ.150కోట్లతో చెరువులను అభివృద్ధి చేశామని, అలాగే రూ.15.64కోట్లతో పెద్ద చెరువు పెద్ద కాల్వను బాగు చేస్తున్నామన్నారు. మత్స్య కారులకు నాణ్యమైన చేపపిల్లలను అందివ్వాలని, చెరువులను కృష్ణా నీటితో నింపాలని, సహకార సంఘాల అభివృద్ధికి మార్కెటింగ్ అవకాశాలను కల్పించాలని జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ కోరారు. మత్స్యశాఖ జిల్లా ఎ.డి. రాజారాం, జిల్లా డైరెక్టర్ నాస మహదేవ్, ఇబ్రహీంపట్నం ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, జడ్పీటీసీ అయిలయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ భరత్‌కుమార్, తెరాస రైతు విభాగం అధ్యక్షులు మొద్దు అంజిరెడ్డి, కౌన్సిలర్లు బండి విజయనిర్మల, నీలం శ్వేత, గుంటి జ్యోతి, మత్స్యసహకార సంఘం నాయకులు దూస వెంకటేష్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

# వాకపల్లి బాధిత మహిళలకు న్యాయం చేయాలి




సభలో మాట్లాడుతున్న ఝాన్సీ

**బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే:** విశాఖ జిల్లాలోని వాకపల్లి గ్రామానికి చెందిన 11 మంది బాధిత మహిళలకు న్యాయం చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ కోరారు. 2007లో 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు ఆదివాసీ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారని, వారిని ప్రభుత్వం ఇంతవరకు శిక్షించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాకపల్లి మహిళలపై రాజ్యం లైంగిక దాడి జరిగి పదేళ్లు అవుతున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం సుందరయ్య కళానిలయంలో చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఘటనకు పాల్పడిన వారిలో 13 మందిపై తూతూమంత్రంగా విచారణ చేసి మిగతా 8 మందికి మినహాయింపు ఇవ్వడం దుర్మార్గమన్నారు. బాధిత మహిళల్లో ఇద్దరు మృతి చెందారని, కానీ పోలీసులకు మాత్రం శిక్షలు పడటంలేదన్నారు. సభకు సీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత అధ్యక్షత వహించగా అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మకుమారి, వి.సంధ్య, జ్యోతి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# చేరువవుతోంది.. మెట్రో మణిహారం

- ప్రారంభానికి కౌంట్ డౌన్ షురూ
- ఒక్కో స్టేషన్ వద్ద రూ.కోటితో అభివృద్ధి పనులు
- మియాపూర్ - నాగోల్ మార్గంలో మిగిలిన పనులపై దృష్టి
- 24 స్టేషన్ల వద్ద వర్గీకరించి చేపట్టిన సుందరీకరణ



ఈనాడు, హైదరాబాద్

**మెట్రో రైల్.. నగరవాసులకు చేరువ అవుతోంది. ప్రారంభానికి సన్నద్ధం అవుతోంది. నగరానికి మణిహారంగా భాసించనుంది.. పర్యావరణ హితంగా చక్కటి ప్రయాణ సౌకర్యం కలుగనుంది. ట్రాఫిక్ జామ్‌లకు అతీతంగా వేగవంతంగా గమ్యానికి చేరే వీలు ఏర్పడనుంది. ఇందుకు కౌంట్ డౌన్ మొదలైంది. పనుల పూర్తికి గడువు సమీపిస్తుండడంతో నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. నవంబరు ఆఖర్లో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు త్వరగా అందుబాటులోకి తేవాలని సర్కారు ఆదేశించడంతో.. మియాపూర్ నుంచి నాగోల్ వరకు మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.**

మెట్రోపై ముందు నుంచి ఉన్న అంచనాలకు భిన్నంగా.. మియాపూర్ నుంచి నాగోల్ వరకు ప్రారంభానికి సన్నద్ధం అవుతోంది. కారిడార్-1లో మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు ఏడాది క్రితమే పనులు పూర్తికాగా.. దీన్ని పంజాగుట్ట వరకు.. లేదంటే మొత్తం కారిడార్ ఎల్‌బీనగర్ వరకు పనులు పూర్తయ్యాక ప్రారంభిద్దామనేది హెచ్ఎంఆర్ ఆలోచన. అదేవిధంగా కారిడార్-3లో నాగోల్ నుంచి మెట్టుగూడ వరకు రెండేళ్ల క్రితమే పూర్తి కాగా.. ఉపయుక్తంగా ఉండదని బేగంపేట వరకు పనులయ్యాక మొదలెట్టాలనే ప్రణాళికలో ఇంజినీర్లు ఉన్నారు. ఇవేవీ ఇప్పట్లో పూర్తయ్యేలా లేకపోవడంతో.. సీఎం సూచనతో మియాపూర్ నుంచి అమీర్‌పేట-నాగోల్ ఒక మార్గంగా ప్రారంభించాలనే ఆదేశాలతో పనులు చకచక జరుగుతున్నాయి.

## అతుకులే కీలకం..

**మియాపూర్ - నాగోల్ మెట్రో మార్గంలో అమీర్‌పేట, బేగంపేట, సికింద్రాబాద్ మూడు ప్రాంతాల్లో మాత్రమే పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇక్కడ వయాడక్ట్, విద్యుత్తు, సిగ్నలింగ్, స్టేషన్ పనులు వేగంగా పూర్తిచేసే పనిలో నిర్మాణ సంస్థ నిమగ్నమైంది.**



**1** మైత్రీవనం వద్ద నిర్మిస్తున్న అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ అతి పెద్దది. కారిడార్-1, 3 మార్గాలు ఇక్కడ ఒక దాన్ని ఒకటి దాటి వెళతాయి. అటు ఎస్ఆర్ నగర్ నుంచి ఇటు గ్రీన్‌ల్యాండ్స్ నుంచి వస్తున్న వేర్వేరు కారిడార్ల వయాడక్ట్‌లను స్టేషన్‌కు అనుసంధానించే పనులు ప్రస్తుతం నడుస్తున్నాయి. గడువు తక్కువ ఉండటంతో ట్రాఫిక్ మళ్లించి మరీ ఈ పనులు చేస్తున్నారు. ఈ ఒక్కచోటనే సుమారు 800 మంది పనిచేస్తున్నారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు.

**2** బేగంపేట వద్ద ఇటీవలే రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రైల్ ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం స్టేషన్ పనులపై దృష్టి పెట్టారు. మిగతా స్టేషన్లకు భిన్నంగా దీన్ని నిర్మిస్తున్నారు. సాధారణంగా స్టేషన్ తక్కువ ఎత్తులో ఉంటుంది. కానీ బేగంపేట వద్ద ఫ్లైఓవర్ ఉండటంతో చాలా ఎత్తులో నిర్మిస్తున్నారు. టిక్కెట్లు తీసుకునే అంతస్తు ఆకృతిలో మార్పులు చేశారు. రోడ్డు, టిక్కెట్లు తీసుకునే అంతస్తు మధ్యలో ఆ చివర.. ఈ చివర మరో అంతస్తును మెట్ల కోసం నిర్మిస్తున్నారు. ఈ పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.

**3** సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈపాటికి పూర్తి కావాల్సి ఉండగా ఆలస్యంగా మొదలెట్టారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని.. నిర్దేశిత గడువు లోపుగా పూర్తవుతుందనే ధీమాని హెచ్ఎంఆర్ వ్యక్తం చేస్తోంది.



**4** మెట్రో ప్రారంభంలో జాప్యానికి కారణమైన ఒలిఫెంటా ఆర్వోబీ పూర్తయినా.. అటు ఇటు వయాడక్ట్‌లను అనుసంధానం చేయాల్సి ఉంది. ఇందుకు మరికొన్ని రోజులు పడుతుందని అధికారులు అంటున్నారు.





**5** మియాపూర్ నుంచి నాగోల్ 30 కి.మీ. మార్గంలో విద్యుత్తు, సిగ్నలింగ్, ట్రాక్ పనులు దాదాపు 25 కి.మీ. వరకు పూర్తయ్యాయి. ప్రకాశ్‌నగర్ నుంచి అమీర్‌పేట మార్గంలో మిగిలిన పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.



సికింద్రాబాద్ జేంసీప ఓవర్ పైనుంచి మెట్రో నిర్మాణం


## స్టేషన్ల సుందరీకరణ



మెట్రో కారిడార్లతో నగర పునర్ నిర్మాణమని ఎప్పటి నుంచో చెబుతున్న మాట ఇది. మెట్రో ప్రారంభం నాటికి దీన్ని చూడబోతున్నారని హెచ్ఎంఆర్ చెబుతోంది. స్టేషన్లవద్ద నిర్మాణ సంస్థ తాను చేయాల్సినంత వరకు చేయగా..వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు హెచ్ఎంఆర్ పనులు చేపట్టింది.

- స్టేషన్‌కు రూ.కోటి వ్యయంతో సుందరీకరణ పనులు మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు మొదలయ్యాయి. అమీర్‌పేట, బేగంపేట, సికింద్రాబాద్ పనులు పూర్తికాక పోవడంతో వీటిని మినహాయించి నాగోల్ వరకు మిగిలిన చోట చేయనున్నారు.
- రహదారులు 30 మీటర్లు ఉన్న చోట మినహాయించి 45 మీ., 60 మీ.వెడల్పు ఉన్న చోట్ల బస్, ఆటో బేలు నిర్మిస్తున్నారు. స్టేషన్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్డులో ఏ,బీ,సీగా విభజించి పాదచారుల బాటలు నిర్మిస్తున్నారు. మొదట మధ్యభాగం 200 మీ. దూరం అభివృద్ధి చేసి.. తర్వాత వీలైనచోట అటు ఇటు మరో 200 మీ.చొప్పున విస్తరించనున్నారు. పాదచారుల బాటలు, స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటు చేయబోతున్నారు.

## డివైడర్ల మధ్య పచ్చదనం..




మియాపూర్ -నాగోల్ మార్గంలో మెట్రో స్తంభాల మధ్య డివైడర్లు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో పచ్చదనం పెంపొందించనున్నారు. ఆహ్లాదకరంగా, నీడ పట్టున పెరిగే వేర్వేరు మొక్కలతో ల్యాండ్‌స్కేప్‌ను అభివృద్ధి చేయనున్నారు. నిర్మాణ సంస్థ డివైడర్ ఎత్తు పెంచే క్రమంలో సిమెంట్ ఇటుకలతో గోడలు నిర్మించి వాటికి ప్లాస్టరింగ్ చేసే పనిలో ఉంది. ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నలుపు, తెలుపు, పసుపు, నీలం రంగుల్లో ఎంపిక చేసిన వాటిని వేయనున్నారు.

## నెల ముందే పూర్తయితే తప్ప..

మెట్రో పనుల పూర్తికి మూడు నెలల గడువు ఉన్నప్పటికీ.. కొన్ని పనులను అక్టోబరు నెలాఖరు నాటికే ముగించాలి. ముఖ్యంగా మధ్యలోని 10కి.మీ. కీలకం. అక్కడ ట్రాక్, సిగ్నలింగ్, విద్యుత్తు, స్టేషన్ ప్లాట్‌ఫాం పనులు పూర్తయితే టెస్ట్, ట్రయల్ రన్‌కు వీలవుతుంది. కనీసం నెలరోజులైనా వీటిని పరీక్షించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ(సీఎంఆర్ఎస్) తుది అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.





## దిగి ఎక్కాల్సిందే..

మియాపూర్ నుంచి నాగోల్ మార్గం ప్రారంభించినా.. ఒకవైపు ఎక్కితే రెండోవైపు గమ్యస్థానానికి ఒకే మెట్రోలో వెళ్లలేరని మెట్రో వర్గాలు అంటున్నాయి. మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు ఒక కారిడార్. అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌లో ఇది మూడో అంతస్తులో ఆగుతుంది. నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు మరో కారిడార్. ఈ మార్గంలో వచ్చే మెట్రో రైలు రెండో అంతస్తులో ఆగుతుంది. కాబట్టి ఇక్కడ రైలు మారాల్సిందే.

- రెండు కారిడార్లను కలుపుతూ సర్వీస్ కోసం సింగిల్ ట్రాక్ అమీర్‌పేట వద్ద ఉన్న అంతర్జాతీయంగా అనుసరిస్తున్న పద్ధతుల ప్రకారం ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ వద్ద మెట్రో మారాల్సిందేనని మెట్రో వర్గాలు అంటున్నాయి.

## ప్రారంభం నాటికి పనులు పూర్తి..

**- ఎన్వీఎస్ రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్**

**నవంబరు ఆఖర్లో ప్రారంభోత్సవం ఉంటుంది. తేదీ ఇంకా ఖరారు కాలేదు. ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈలోపు మియాపూర్ నుంచి నాగోల్ మధ్యలో మిగిలిన పనులు పూర్తిచేస్తాం. సికింద్రాబాద్ ఈస్ట్, బేగంపేట స్టేషన్లు పూర్తి కావాల్సి ఉంది. మిగతావన్నీ సిద్ధంగా ఉన్నాయి. అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ పూర్తి చేసేందుకు 800 మంది పనిచేస్తున్నారు. ఇది కూడా ప్రారంభోత్సవం నాటికి పూర్తవుతుంది.**






**పనులు జరుగుతున్న స్టేషన్లు**
- అమీర్‌పేట
- బేగంపేట
- ప్రకాశ్‌నగర్
- రసూల్‌పురా
- ప్యారడైజ్
- పరేడ్ గ్రౌండ్స్
- సికింద్రాబాద్ ఈస్ట్


- ముహూర్తం: నవంబరు చివర్లో
- ప్రారంభించేది: ప్రధాని మోదీ
- ఎక్కడి నుంచి: మియాపూర్-అమీర్‌పేట-నాగోల్
- దూరం: 12+18 = 30కి.మీ.
- ప్రయాణ సమయం: 50 నిమిషాలు (రోడ్డుపై గంటన్నర పడుతుంది)
- స్టేషన్లు : 24
- పార్కింగ్ ఉన్నవి: 12

## ఏ దశలో ఉంది?

తొలుత ప్రారంభించే దూరం : 30 కి.మీ.

ఇప్పటికే సిద్ధంగా ఉన్నది: 20 కి.మీ. (మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ 12కి.మీ., నాగోల్ నుంచి మెట్టుగూడ 8 కి.మీ.)

పనులు పూర్తిచేయాల్సిన దూరం: 10 కి.మీ. (ఎస్ఆర్‌నగర్ నుంచి మెట్టుగూడ)




## 12 చోట్లనే పార్కింగ్..

ప్రస్తుతం ప్రారంభించే 30 కి.మీ.మార్గంలో 24 స్టేషన్లు రాబోతున్నాయి. అటు ఇటుగా కిలోమీటరుకు ఒక స్టేషన్ వస్తోంది. సగానికి సగం స్టేషన్లలో పార్కింగ్‌కు స్థలం లేదు. 12చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

**పార్కింగ్ ఉన్న స్టేషన్లు**
- మియాపూర్
- కూకట్‌పల్లి
- బాలానగర్(వై జంక్షన్)
- భరత్‌నగర్
- అమీర్‌పేట్
- బేగంపేట
- రసూల్‌పుర
- ప్యారడైజ్
- పరేడ్ గ్రౌండ్స్
- సికింద్రాబాద్ ఈస్ట్
- ఉప్పల్
- నాగోల్

## ప్రతి స్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జినే..

నగరంలోని 66.56 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న మెట్రో మార్గంలో 59 స్టేషన్లు రాబోతున్నాయి. దాదాపు సగటున కిలోమీటరుకు అటూఇటుగా ఒక స్టేషన్ వస్తోంది. ఇవన్నీ కూడా ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, నాగోల్ నుంచి రాయదుర్గం, ఇమ్లిబన్ నుంచి జేబీఎస్ మార్గంలో ఉన్నాయి. అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఉన్న స్టేషన్లను ఫుట్ ఓవర్ బ్రిడ్జిగా ఉపయోగించుకోవచ్చు అంటున్నాయి మెట్రో వర్గాలు. ప్రతి స్టేషన్ మొదటి అంతస్తు వరకు ఎవరైనా వెళ్లొచ్చు. ఒకవైపు నుంచి ఎక్కి.. మరో వైపు నుంచి దిగొచ్చు. మెట్లు, ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు ఉపయోగించుకోవచ్చు.

## మాల్స్, మల్టీప్లెక్స్ ప్రారంభించే అవకాశం..



పంజాగుట్టలో మెట్రో అతిపెద్ద మాల్ పూర్తయినా.. మెట్రో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చినప్పుడే వీటిని ప్రారంభించాలనేది ఒప్పందం. పంజాగుట్ట, హైటెక్ సిటీ మాల్స్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఎర్రమంజిల్‌లో పనులు చివరి దశలో ఉన్నాయి. నవంబరు ఆఖరులో వీటిని కూడా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టిన మెట్రో ప్రాజెక్ట్‌లో ప్రయాణికుల ఛార్జీల రూపంలో సగమే ఆదాయం వస్తుంది. మిగతా సగంలో 45 శాతం స్థిరాస్తి ద్వారా సమకూర్చుకోవాల్సిందే. అందులో భాగంగా నిర్మాణ సంస్థకు కేటాయించిన 20 స్థలాల్లో కేవలం నాలుగు చోట్ల మాల్స్ నిర్మించగా మూడు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో పీవీఆర్ సినిమా స్క్రీన్స్, ఫుడ్ కోర్టులు, వినోద, వస్త్ర, ఇతర దుకాణాలు, కార్యాలయాలు రాబోతున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ నెక్ట్స్ పేరుతో ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకుంది. 18.5 మిలియన్ చ.అడుగులను దశలవారీగా అభివృద్ధి చేయబోతున్నారు. ఇందులో తొలుత 1.1 మిలియన్ చ.అడుగుల నిర్మాణం పూర్తవడంతో అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. స్టేషన్‌లోని రిటైల్ సరేసరి.

## వచ్చే ఏడాదిలో...

ఈ ఏడాది 30 కి.మీ. ప్రారంభిస్తే.. మిగతా 36.56 కి.మీ. మెట్రో మార్గాన్ని వచ్చే ఏడాది ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తారు. ఇందులోనూ రెండు కారిడార్లు ఉన్నాయి. ఒకటి అమీర్‌పేట నుంచి ఎల్‌బీనగర్ వరకు 16.50 కి.మీ. కారిడార్-1 కాగా, మిగిలిన 10.06 కి.మీ. జేబీఎస్ నుంచి ఇమ్లిబన్ వరకు కారిడార్-2. వీటి పనుల పురోగతి పరిశీలిస్తే..

### కారిడార్-1

అమీర్‌పేట నుంచి ఎల్‌బీనగర్ మార్గంలో లక్డీకాపూల్, నాంపల్లి, ఇమ్లిబన్ వద్ద పనులు పూర్తిచేయాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మాణ సంస్థ దృష్టి అంతా ప్రారంభోత్సవ మార్గంపై పెట్టడంతో వీటి పూర్తికి మరికొంత సమయం పడుతుంది.

- లక్డీకాపూల్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అటు ఇటు వయాడక్ట్ నిర్మాణ సన్నాహాలు చేపట్టారు. త్వరలో పట్టాలపైన వయాడక్ట్ పూర్తిచేసే అవకాశం ఉంది.
- నాంపల్లి వద్ద రహదారి ఇరుకిరుకు, పైపులైను మార్చాల్సి రావడంతో రెండు స్తంభాల పనులు మిగిలిపోయాయి. వాటి పునాదులు కూడా ఇటీవల వేశారు. స్తంభాలు వేసి వయాడక్ట్ పూర్తి చేస్తే.. ఈ కారిడార్‌లో పునాదులు, స్తంభాలు, వయాడక్ట్ పనులు వందశాతం పూర్తయినట్లే.
- ఇమ్లిబన్ వద్ద ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ పనులు కీలక దశలో ఉన్నాయి. పూర్తవడానికి కొద్ది నెలలు పట్టే సూచనలు ఉన్నాయి.
- పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, అసెంబ్లీ, కోఠి వైద్య కళాశాల, మలక్‌పేట స్టేషన్ పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి. చాదర్‌ఘాట్ నుంచి అమీర్‌పేట వరకు విద్యుత్తు, ట్రాక్, సిగ్నలింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆరంభం కల్లా ఈ కారిడార్ పూర్తవుతుంది.

### కారిడార్-2

జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఈ మార్గం ప్రతిపాదించినప్పటికీ.. పాతబస్తీలో అలైన్‌మెంట్ మార్పుపై సర్కారు ఎటూ తేల్చక పోవడంతో ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఇమ్లిబన్ వరకే పనులు ప్రారంభించారు. జులై31 నాటికి పురోగతిని చూస్తే..

- 371 పునాదులకు గాను 326 ఇప్పటికే పూర్తయ్యాయి. ఇది దాదాపు 87.9 శాతానికి సమానం.
- స్తంభాలు సైతం 371కిగాను 276 పూర్తయ్యాయి. 74.4 శాతం పూర్తయ్యిందన్నమాట.
- వయాడక్ట్ పనులు10.06కి.మీ. గాను 3.90 కి.మీ. పూర్తయ్యాయి.
- 9 స్టేషన్ల పనులు మొదలెట్టినా చాలావరకు ప్రారంభ దశలో ఉన్నాయి.
- ఈ మార్గంలో బోయిగూడ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. దీనికి ఎక్కువ సమయం పడుతుంది. ప్రస్తుతం ఒలిఫెంటా వద్ద పూర్తిచేయడంతో ఆ బృందం ఇక రెండో స్టీల్ బ్రిడ్జి పనులు మొదలెట్టే అవకాశం ఉంది.
- రంగ మహల్ చౌరస్తా వద్ద కారిడార్-1 మీదుగా కొద్దిదూరం కారిడార్-2 మార్గం వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఇక్కడ డబుల్ డెక్ స్తంభాల పనులు జరుగుతున్నాయి. దీనికి ఎక్కువ సమయమే పడుతుంది.
- ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు 2018 నవంబరు వరకు గడువు ఉంది. ఆ లోపు పూర్తి చేస్తామంటున్నాయి మెట్రో వర్గాలు.

## వీటి గురించి ఆలోచించాలి..!

### దాటే మార్గం చూపండి..



మెట్రో స్తంభాల పనులు పూర్తి కావొస్తుండటంతో డివైడర్ల పనులు మొదలెట్టారు. రెండు స్తంభాల నడుమ 4 అడుగుల ఎత్తు ఉండేలా అటూఇటూ గోడ కడుతున్నారు. మధ్యలో మట్టి పోసి పచ్చదనం పెంపొందించనున్నారు. అయితే ఇన్నాళ్లు అడుగు ఎత్తులో ఉన్న డివైడర్ మీదుగా ఆటు ఇటూ రహదారి దాటేవారు. ఇప్పుడు ఎత్తు పెంచుతుండటంతో అర కి.మీ.వరకు మధ్యలో ఖాళీలు లేకపోవడంతో రోడ్డు దాటాలంటే మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే 3చోట్ల ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను తొలగించారు. దీంతో పాదచారుల బాటలపై హెచ్ఎంఆర్ దృష్టి పెట్టాలి.

### స్కైవాక్స్.. నిర్మించాలి



వాహనాలతో నిండిపోతున్న రహదారులపై నడక దాదాపు అసాధ్యంగా మారింది. నడిచి వెళుతున్న వారిని వాహనాలు ఢీకొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఒక మెట్రో స్టేషన్ నుంచి మరో మెట్రో స్టేషన్ మధ్య ముఖ్యమైన కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లోకి చేరుకునేందుకు హెచ్ఎంఆర్ స్కైవాక్స్‌ను ప్రతిపాదించింది. అవసరమైన చోట్ల వీటిని వెంటనే చేపట్టాలి.

### ప్రమాద సూచికలు..



మెట్రో మార్గాల్లో 200 స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని ట్రాఫిక్ పోలీసుల పరిశీలనలో తేలింది. ఇవి రహదారి మధ్యలో ఉండటం, రోడ్డు ఎత్తు పల్లాలు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి స్తంభాలను ఢీకొంటున్నాయి. ప్రమాదాల నివారణకు హెచ్ఎంఆర్ ఇంజినీర్లతో కూడిన కమిటీని వేసింది. ఇప్పటివరకు దిద్దుబాటు చర్యలు పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలి.

### నీటి సంరక్షణ..



మెట్రో ట్రాక్ మార్గంలో కురిసే వాన నీటిని స్తంభాల గుండా రోడ్డుపైకి వదలడాన్ని జీహెచ్ఎంసీ అభ్యంతరం చెబుతోంది. వీలైనంత మేర వాననీటిని సంరక్షించాలి. మిగతాది నేరుగా వరద కాలువలో కలిసేలా డ్రైన్ల అనుసంధానం చేయాలి. ఉప్పల్, మియాపూర్ డిపోలు, స్టేషన్ల వద్ద ఈ చర్యలు ఉన్నప్పటికీ అన్ని స్టేషన్లలో పూర్తి స్థాయిలో చేపట్టలేదు. డివైడర్ల మధ్యన ఉన్న మొక్కలకు వాననీటినే వాడాలి.

### పాదచారుల బాటలు...



మెట్రో కోసం చాలా ప్రాంతాల్లో రహదారి విస్తరణ చేపట్టారు. అప్పటివరకు అక్కడ ఉన్న పాదచారుల బాటలు ధ్వంసమయ్యాయి. కొన్నింటిని పునరుద్ధరించినా.. చాలావరకు ఇప్పటికే ఎక్కడికక్కడ మీ బాధలేవో మీరు పడండని వదిలేశారు. కొన్నిచోట్ల కూడళ్లలో స్తంభాలు వేసేందుకు అక్కడి ఐలాండ్స్‌లో కొంతభాగం తవ్వేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య విగ్రహమున్న కూడలిలో పనులు పూర్తైనా ఇప్పటికీ దాన్ని సరిచేయలేదు.

# మాటలుండాలి.. రాతలుండాలి

నేడు తెలుగు భాషా దినోత్సవం



అప్పుడే తెలుగు భావితరాలకు చేరుతుంది

ఈనాడు, హైదరాబాద్

మాతృ భాషలో మమకారం ఉంటుంది.. వెటకారం ఉంటుంది.. భావం ఉంటుంది.. బతుకు ఉంటుంది.. అన్నింటికీ మించి భాష బతుకుతుంది..భావి తరాలకు చేరుతుంది.. అందుకు మాటలుండాలి.. రాతలుండాలి.. తరం తరం నిరంతరం జనం నోట నానుతుండాలి అంటారు భాషావేత్తలు.

దేశ భాషలందూ తెలుగు లెస్స అన్నా.. వ్యవహారికంలో మాతృభాష బక్కచిక్కిపోతోంది. పలుకుల్లో తెలుగు పలుకుబడి లేదు.. జాతీయాల జాడ.. నుడికారంలోని చమత్కారం మచ్చుకు కూడా కానరావట్లేదు.. సామెతలు సన్నబడ్డాయి.. ఛలోక్తులు చల్లారిపోయాయి.. గత వైభవాన్ని కీర్తించడంతోనే సరిపెడుతున్నాం.. బతికించుకోవాలనే చర్చలతో సరిపుచ్చుతున్నాం.. ఆచరణలో మాత్రం ఆలసత్వం వీడటం లేదు.

### మొక్కుబడి తంతు..

నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. మొక్కుబడిగా కొన్ని ప్రకటనలు తెలుగులో ప్రదర్శించడం మినహా అమ్మభాష కనపడదు. పౌరసేవలకు సంబంధించి స్వీకరించే దరఖాస్తుల నుంచి వారు పొందే సేవల వరకు తెలుగులో అందించాల్సి ఉండగా అవేవీ ఆచరణలో కనబడటం లేదు. జీహెచ్ఎంసీ, సీపీడీసీఎల్, కలెక్టర్, పర్యాటక కార్యాలయాల్లో తెలుగులో సమాచారం అరకొరగానే లభిస్తోంది. ఏదైనా సమాచారం కోరినా చాలా కార్యాలయాలు ఆంగ్లంలోనే ఇస్తున్నాయి.

### ఇదొక్కటే ఊరట..

నెటిజన్లు తెలుగు వెలుగు కోసం కలలు కన్నారు.. కంప్యూటర్‌కు తెలుగు నేర్పారు. అంతర్జాల వేదికపై తెలుగు జెండాని ఎగరవేయగల్గారు. తెలుగులోనే టైపింగ్ సౌలభ్యం రావడంతో ఇ-తెలుగు వ్యాప్తి పెరిగింది.. నెట్‌లో చదవడం.. రాయడం.. మెయిల్స్ పంపుకోవడం సులువైంది. సెర్చ్ ఇంజిన్లు మొజిల్లా ఫైర్‌ఫాక్స్ తెలుగు కీబోర్డ్ సపోర్ట్‌కు ముందుకు వచ్చింది. ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరల్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. మొబైల్‌లోనూ సులువుగా వినియోగిస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల రాకతో తెలుగుకు తోడ్పాటు పెరిగింది. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో తమ భావాలను, బంధుమిత్రులకు శుభాకాంక్షలను ఎక్కువ మంది మాతృభాషలో వెల్లడిస్తున్నారు. తెలుగు నేల మీద ఉన్నవారే కాదు.. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఇతర ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు తమ మాతృభాష తెరపైన కన్పించగానే మురిసిపోతున్నారు.

## అ..ఆ..లపై నిర్లక్ష్యం కూడదు

పునాదుల స్థాయిలోనే తెలుగు భాష నిరాదరణకు గురవుతుందనడానికి ఇదో చక్కని ఉదాహరణ. ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక తరగతుల్లో బోధించేందుకు ప్రత్యేకంగా తెలుగు పండితులు లేకపోవడమే ఇందుకు నిదర్శనం. 1-5 తరగతుల వరకు ఎస్‌జీటీ ఉపాధ్యాయులే బోధిస్తున్నారు. మాతృభాషే కదా చిన్నచూపు ఇందులో కొట్టొచ్చినట్టు కనబడుతోంది. అ..ఆ..లే కదా ఎవరైనా చెబుతారులే అనే నిర్లక్ష్య ధోరణి ఇందుకు కారణమవుతోంది. దీనికితోడు ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోనూ ఆంగ్ల మాధ్యమ బడులు పుట్టుకొస్తుండటంతో తెలుగు భాష విషయంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాదిరిగా ప్రాథమిక తరగతుల స్థాయిలోనూ తెలుగు భాషా పండితులను నియమించాలనే డిమాండ్ ఉన్నా.. అది కార్యారూపం దాల్చడం లేదు. మరోవైపు ఉన్నత పాఠశాలల్లోనూ గ్రేడ్-1, గ్రేడ్-2 పండితులను నియమించాల్సి ఉన్నా చాలా చోట్ల రిక్తహస్తమే ఎదురవుతోంది. మాతృభాషలో పునాది గట్టిగా పడితేనే మిగతా భాషలనూ పిల్లలు బాగా ఆకళింపు చేసుకుంటారని భాషా పండితులు నొక్కి చెబుతూ ఉన్న నేపథ్యంలో పాలకులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

### దయనీయ స్థితిలో ..

ప్రస్తుతానికి విద్యార్థుల విషయంలో మాతృభాష పరిస్థితి దయనీయంగానే ఉందని గణాంకాలు పేర్కొంటున్నాయి. పదో తరగతి పరీక్షల ఫలితాల్ని పరిశీలిస్తే చాలు విద్యార్థులు ఏ అంశంలో ఏ స్థాయిలో ఉన్నారో తెలిసిపోతుంది. గత ఏడాది ఫలితాల సరళిని చూస్తే గణితం, సామాన్య శాస్త్రం తర్వాత ఎక్కువమంది అనుత్తీర్ణులైంది తెలుగులోనే.

జిల్లాలో గత ఏడాది అనుత్తీర్ణులు(ప్రైవేటు, పాఠశాలద్వారా కలిపి) ఇలా..

- ప్రథమ భాష : 4,575
- ద్వితీయ భాష : 266
- తృతీయ భాష : 2,046
- గణితశాస్త్రం : 19,147
- సామాన్యశాస్త్రం : 8,255
- సాంఘిక శాస్త్రం : 1,300

### పాలనకు అవసరమైన పదకోశంపై దృష్టి..

**– దేవులపల్లి ప్రభాకరరావు, అధికార భాష సంఘం అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్రం**



“పరిపాలనలో అధికార భాష కొంత వరకు అమలు అవుతోంది. దరఖాస్తులు, ఉత్తర ప్రత్యుత్తరాలు కొన్ని విభాగాల్లో తెలుగులోనే జరుగుతున్నాయి. జీవోలు తెలుగులో వస్తున్నాయి.

- సాధారణ పరిపాలన విభాగంలో మాతృభాష అమలు తీరుపై అధికార భాష సంఘం తరుపున అధికారి వెళ్లి పరిశీలించి వస్తుంటారు. గతంతో పోలిస్తే ఈ మూడేళ్లలో కొంత మెరుగైందని చెప్పగలను.
- తెలంగాణ ఏర్పాటై సీఎం కేసీఆర్ బాధ్యతలు తీసుకున్నాక సమీక్షల్లో, పరిపాలన బాధ్యులతో తెలుగులోనే మాట్లాడుతున్నారు. సహజంగానే ఆ ప్రభావం అధికారులపైన ఉంటుంది. వారు తెలుగులోనే మాట్లాడుతున్నారు. రాని వారు నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.
- పరిపాలనలో తెలుగు వ్యాప్తికి అవసరమైన పదజాలం, శబ్దకోశాలను భాషావేత్తలతో కలిసి రూపొందిస్తున్నాం. నిఘంటువు రూపొందించే పనిలో ఉన్నాం. రెవెన్యూ, ఆరోగ్య, విద్య ఇలా వివిధ శాఖల్లో అవసరమైన పదజాలం సిద్ధం చేయడం ముఖ్యం. దానిపైన కృషి జరుగుతోంది.
- భాష అనేది సున్నితమైన విషయం. భాషలో ఎప్పుడు మార్పులు వచ్చినా ప్రతిస్పందన ఉంటుంది. అందుకే అందరి ఆమోదంతో అందరికీ అనువుగా ఉండాలి.

### తెలుగు భాషకు ముప్పు ఉండదు..

**– డాక్టర్ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన విభాగం**



ప్రైవేటు పాఠశాలలు ఆంగ్లంలో బోధించినా తెలుగు భాషకు ముప్పు ఉండదు. కానీ, ఆవరణలో విద్యార్థులు తెలుగులో మాట్లాడకూడదనే నిబంధన పెట్టడం దురదృష్టకరం. ఇలాంటివాటికి ప్రభుత్వాలు అడ్డుకట్టవేయాలి. బోధన ఏ భాషలోసాగినా విద్యార్థులు నచ్చిన భాషలో మాట్లాడే హక్కు వారికి ఉంటుంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఆంగ్లం నేర్చుకున్నప్పటికీ ఇళ్లల్లో తెలుగులోనే మాట్లాడతారు. తెలుగుకు ఆదరణ తగ్గిపోతుందనే ప్రచారంలో వాస్తవం ఉండదు. పీజీ, పీహెచ్‌డీ సీట్లు పొందేందుకు ఉన్న పోటీని చూస్తే యువతకు తెలుగుపై ఉన్న మక్కువ అర్థం అవుతుంది. తెలుగుభాషపై లోతైన పరిశోధనలు చేస్తున్నారు. సివిల్స్, గ్రూప్స్‌ల్లోను తెలుగును ఐచ్ఛికంగా ఎంచుకున్న వారు రాణిస్తున్నారు. ఇతరభాషలకు చెందిన వారు తెలుగురాష్ట్రాల్లో చదువుకుంటే.. వారికి తెలుగులో కనిష్ఠ మార్కులు వస్తేసరిపోతుందనే నిబంధన పెట్టాలి.

### గిడుగు వన్నె తెచ్చారు..

**– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం**



తొలి తెలుగుభాషా శాస్త్రవేత్తగా గిడుగు రామ్మూర్తినాయుడిని చెప్పుకోవచ్చు. ఆయన వాడుకభాష వికాశం కోసం జీవితాంతం పరిశ్రమించిన భాషా ఉద్యమకారుడు. విద్యాబోధన, పత్రికా రచన, సాహిత్య సృజన, పరిపాలన తదితరాల్లో తెలుగుభాషా వినియోగం బాగా జరగాలని గుర్తించారు. గ్రాంధిక భాషావాదుల విమర్శలు ఎదుర్కొన్నారు. వారికి దీటైన సమాధానంగా 'పండిత భిషక్కుల భాషా భేషజం' గ్రంథాన్ని రచించి తనకు గ్రాంధిక భాషపై, ఛందస్సుపై, వ్యాకరణంపై ఉన్న సాధికారతను నిరూపించుకున్నారు. స్వరభాషను నేర్చుకొని ఆభాషకు నిఘంటువును రూపొందించారు.వాడుక భాషలో ఆధునిక సాహిత్య సృజన పత్రికా రచన జరగడానికి మూలపురుషుడిగా నిలిచారు. ఆయన తెలుగుభాషకు చేసిన కృషిని ఆదర్శంగా తీసుకొని తెలుగు విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోంది. అమెరికా వంటి పలు దేశాల్లోని పలు విశ్వవిద్యాలయాలతో తెలుగువర్సిటీ ఎంవోయూ కుదుర్చుకుంది. విదేశాల్లోను తెలుగుభాషకు విస్తృతికి కృషి చేస్తోంది.

### మాతృభాషలో అనువాదం అవసరం..

**– ఓలేటి రామావతారం, ఆదాయ పన్ను శాఖ అధికారి**

వివిధభాషల్లోని మంచి పేరున్న పలు పుస్తకాలను మాతృభాషలో అనువాదం చేయించాలి. దీనిపై తెలుగు రాష్ట్రప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. జానపదుల సంస్కృతి, సంప్రదాయాలు నుంచి సైబర్ సంస్కృతి వరకు జీవితాన్ని ప్రతిబింబించే రచనలు తెలుగులో వస్తున్నాయి. పరభాష మోజులోపడి వ్యవహారిక భాషను అభివృద్ధి చేసుకోవడంలో శ్రద్ధ చూపించట్లేదు. చాలా పాఠశాలల్లో తెలుగులో మాట్లాడితే నేరమన్నట్లు విద్యార్థులను నిరుత్సాహ పరుస్తున్నారు. ఇది మారాలి. అన్ని పాఠశాలల్లో 10వ తరగతి వరకు తెలుగుభాషను కచ్చితంగా బోధించాలి. వ్యాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితరాల్లో తెలుగులోనే సాహిత్య అంశాలు చర్చిస్తూ, విశ్లేషిస్తూ భాషా వికాసానికి ఎక్కువమంది తోడ్పడుతున్నారు. భాగవతం, రామాయణం వంటి వాటిల్లో మధుర సంఘటనలను తెలుగులోకి అనువదించి సామాజిక మాధ్యమాల్లో యువతకు పంపిస్తుంటాను. దీనికి మంచి ఆదరణ వస్తోంది.



## విద్యార్థుల కవితాకృతి

**అమ్మ ప్రేమ-మాతృ భాష అంశంపై వివిధ పాఠశాలల్లో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో విద్యార్థులు చాటిన కవితావేశమిది.**

### అమ్మ-భాషకు జైజై



అమ్మ జన్మనిస్తుంది
భాష బతుకునిస్తుంది
అమ్మ నవమాసాలు మోస్తే
భాష బతుకంతా వెంట ఉంటుంది
అందుకే అమ్మకు జై అంటాను
నామాతృ భాషకు జైజై అంటాను
అమ్మ కనిపించే దైవం
భాష నీడగా నిలిచే దైవం
అందుకే అమ్మకు కడదాకా తోడుగా ఉందాం
మాతృభాషపై మమకారాన్ని
ప్రపంచానికి చాటుదాం

**– నూతన కుమారి, 9వ తరగతి చింతపట్ల ఉన్నత పాఠశాల, యాచారం**

### అందరూ మెచ్చినది..



అమ్మ గోరు ముద్ద ఎంత తియ్యనిదో..
తెలుగు భాష అంత మధురమైనది
ఎందరో కవులు రాసిన కవిత్వాలు..
.మనుషులను మార్చిన చరిత్రలు..
అందరూ మెచ్చిన భాష తెలుగు తల్లి ధ్యాస..
పెదవి పలికే మాట మంచిని కోరే బాట..
ఎంత పుణ్యమో తెలుగు పలకడం...
అంత ధన్యం మాతృభాషను నేర్వడం...
దేశ భాషలందు తెలుగులెస్స...పలుకులన్నీ పలకాలి మాతృభాషలో..

**– సృజన్, తొమ్మిదో తరగతి, బాలాజీనగర్ ఫైరింగ్ రేంజ్ ఉన్నత పాఠశాల, జవహర్‌నగర్**

### జాబిల్లి కన్నా చల్లనైనది



నెమలి నాట్యం కన్నా..
కోకిలగానం కన్నా
పూల అందం కన్నా..
అమ్మ ప్రేమ, మాతృ భాష మిన్న
ఆకాశం కన్నా విశాలమైనది అమ్మ ప్రేమ
సముద్రం కన్నా లోతైనది మాతృ భాష
జాబిల్లి కన్నా చల్లనైనది అమ్మ ప్రేమ..
భూమి కన్నా దృఢమైనది మాతృ భాష..
అమృతం కన్నా తీయనైనది అమ్మ ప్రేమ
తేనెకన్నా తియ్యనైనది మాతృభాష..
నెయ్యి కన్నా కమ్మనైనది అమ్మ ప్రేమ
వెన్న కన్నా మధురమైనది మాతృభాష

**– జి.సింధు, రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**

# నిమజ్జన వేళ.. పాలిథిన్ సంచులతోనూ పెను సమస్యే!

ఈనాడు-హైదరాబాద్

వినాయక నిమజ్జన కార్యక్రమం కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నిమజ్జన కేంద్రాల వద్ద అప్పుడే గుట్టలుగా పాలిథిన్ సంచులు పోగవుతున్నాయి. కొందరు ఈ పాలిథిన్ సంచులను చెరువులోనే పడేస్తుంటే మరి కొందరు చెరువుగట్టుమీదే పడేసి పోతున్నారు. దీంతో చెరువు సమీపంలో క్వింటాళ్ల కొద్దీ పాలిథిన్ సంచులు పోగువుతున్నాయని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. ఈ పాలిథిన్ వ్యర్థాల కారణంగా కూడా చెరువులు కలుషితం కావడంతోపాటు చెరువు కట్టలపై పడేసిపోతుంటే ఇవి గాలికి ఎగిరి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతుండటంతో పాటు పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. 50మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్ సంచుల వినియోగంపై నిషేధమున్నా నగరంలో వీటి వాడకం ఇబ్బడిముబ్బడిగానే ఉంటోంది. నగర శివారుల్లో ఉన్న అనేక అనధికారిక ఖార్ఖానాల్లో ఇవి తయారవుతూనే ఉన్నాయి. ఇవి ఇప్పుడు చెరువు కట్టలపై కనిపిస్తున్నాయి.


నిమజ్జన ప్రాంతంలో కొలను పక్కన పాలిథిన్ సంచుల చెత్త

## గుడ్డ సంచులే మేలు..

పవిత్రంగా పూజించి అంతే పవిత్రంగా నిమజ్జనం చేసే వారు పాలిథిన్ సంచులు వినియోగించుకోకపోవడమే మేలని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ, జనుముతో చేసిన సంచులను వినియోగించుకొని వాటిలో విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనం చేస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసినవారవుతారు. ప్రస్తుతం నగరంలో నిత్యం దాదాపు 4500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తుంటే ఇందులో పదినుంచి 20 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. వీటితో పర్యావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. పాలిథిన్ సంచులు మురికి కాలవల్లో పేరుకుపోతుండటంతో కాలువలు కూడా పూడిపోతున్నాయి.. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పాలిథిన్ సంచులు వాడకుండా నిమజ్జనం పూర్తిచేస్తే పర్యావరణాన్ని కూడా కాపాడిన వారవుతారు.

## పర్యావరణ పరిరక్షణ అవసరం

*- జయప్రకాశ్, గోగ్రీన్ సంస్థ వ్యవస్థాపకుడు*

నిమజ్జన వేళ కూడా పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలి. పాలిథిన్ సంచులు కలిస్తే నీళ్లు కలుషితమవుతాయి.. జలచరాలు నశిస్తాయి. పాలిథిన్ సంచులు భూమిలో కలిసేందుకు వందల ఏళ్లు పడుతుంది. ఇది ప్రకృతి విధ్వంసానికి దారితీస్తుంది. అందుకే పాలిథిన్ సంచులకు ప్రత్యామ్నాయంగా కాగితం.. గుడ్డ సంచులు వినియోగించుకుంటే మంచిది. ఈ సంచులతో విగ్రహాలను తీసుకువెళ్లి నిజమ్జనం తరవాత తిరిగి సంచులను తెచ్చుకునేలా ఉంటే మేలు.

## నిమజ్జనం కోసం..

ఇళ్లల్లో పెట్టుకునే చిన్న వినాయక విగ్రహాలను.. పూజించిన పత్రిని కూడా చెరువుల్లో నిమజ్జనం చేస్తుంటారు. కొందరు సొంతంగా వాహనాలపై వచ్చి విగ్రహాలను నిమజ్జనం చేస్తుంటారు. మరి కొందరు తమ ప్రాంతంలో పందిళ్లల్లో ఏర్పాటుచేసిన పెద్ద విగ్రహాలు నిమజ్జనం చేసేప్పుడు తమ ఇళ్లల్లో పూజించిన విగ్రహాలను కూడా నిమజ్జనం చేయమని వారికి ఇస్తుంటారు. ఇలా నిమజ్జనం కోసం సొంతంగా తీసుకువచ్చినా.. ఇతరులకు అప్పగించినా వాటిని జాగ్రత్తగా పాలిథిన్ సంచుల్లో ఉంచి ఇస్తున్నారు. ఇలా పాలిథిన్ సంచుల్లో తీసుకువచ్చిన విగ్రహాలను కొందరు ఆ సంచితోనే చెరువులో పడేస్తున్నారు. కొందరు విగ్రహాన్ని మాత్రం నిమజ్జనంచేసి ఆ సంచిని చెరువు గట్టుమీదే పడేసిపోతున్నారు. ఇలా ప్రతి చెరువుగట్టునా గుట్టలు పాలిథిన్ సంచులు పేరుకుపోతున్నాయి. వినాయకచవితి తరవాత 3వ రోజు నుంచి నిమజ్జన కార్యక్రమం జరుగుతోంది. మూడోరోజు స్వల్ప సంఖ్యలోనే విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఇలా స్వల్ప సంఖ్యలోనే చేసిన రోజే కుప్పలు తెప్పలుగా పాలిథిన్ సంచులు చెరువు కట్టలపై ప్రత్యక్షమైతే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. వేలసంఖ్యలో విగ్రహాలను ఇలా పాలిథిన్ సంచులతో తీసుకువస్తే చెరువు కట్టలవద్ద పాలిథిన్ సంచుల గుట్టలు పేరుకుపోయే ప్రమాదముంది. కొన్నిగాలిలో తేలి చుట్టపక్కల ప్రాంతాలలో పడిపోతాయి. ఇవి భూమిలో కలసిపోవాలంటే దశాబ్దాల కాలం పడుతుంది. అందుకే పాలిథిన్ సంచులను వినియోగించకపోవడమే మేలు.


ఆకట్టుకునేలా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శోభాయాత్ర


హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనమవుతున్న గణపతుల లెక్కలో వలంటీర్లు


ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన సందడి

## వానల వేళ.. 'తక్షణ' రక్షణ!



నగరంలో వర్షాల వేళ సమస్యలు ఎదురైన చోట వెంటనే సహాయక చర్యలు అందించే తక్షణ మరమ్మతుల సిబ్బంది సంబంధిత వాహనంలో సోమవారం ఇలా వర్షంలోనే వెళుతూ కనిపించారు. నీటిని ఎత్తిపోయడానికి ఉపయోగించే తట్టలను వారు తలపై పెట్టుకుని వర్షంనుంచి కాపాడుకున్నారు

## డాక్టర్ తిరునగరికి మాతృభాషా పురస్కారం



పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: చింతల్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తిరునగరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేసే మాతృభాషా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈయన యాదాద్రి జిల్లా రాజపేట మండలం, బేగంపేట గ్రామానికి చెందినవారు. తెలుగు అధ్యాపకుడుగా పదవీవిరమణ చేసిన అనంతరం చింతల్‌లో స్థిరపడ్డారు. ఈయన నాలుగు దశాబ్దాలకుపైగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఉన్న సమయంలో అధికార భాషా సంఘం సభ్యుడిగా కొనసాగారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలకుగాను 2003లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారత్ భాషా భూషణ్ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. ఆయన తెలుగు సాహిత్యంపై 30 పైగా గ్రంథాలు రాసారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికిగాను పలు విశ్వవిద్యాలయాలు ప్రశంసాపత్రాలు అందజేశాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేసి సన్మానిస్తారు. డాక్టర్ తిరునగరి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ తనను తెలుగు భాషా పురస్కారానికి ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలుగు భాషకు చేస్తున్న సన్మానంగా భావిస్తున్నానన్నారు.

## పోలీస్‌శాఖలో టెన్నిస్ క్రీడా కిరణం

- ప్రపంచ పోలీస్, ఫైరింగ్ క్రీడల్లో రెండు కాంస్య పతకాలు
- పదో ఏట నుంచే టెన్నిస్ రాకెట్ పట్టిన బోస్‌కిరణ్


బోస్ కిరణ్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

మాదన్నపేట, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి 15 వరకు లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్ తెలంగాణ పోలీసు శాఖకు ప్రత్యేకం. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం నుంచి టెన్నిస్ క్రీడలో రెండు కాంస్య పతకాలు సాధించిన బోస్ కిరణ్ ఈ శాఖకు చెందినవాడే. హైదరాబాద్ నగరానికి చెందిన బోస్ కిరణ్ చదువుకునేటప్పటి నుంచే నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు టెన్నిస్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. అంతర్‌జిల్లా, అంతరాష్ట్ర, జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీల్లో పాల్గొని వందల పతకాలను సాధించారు. 2002లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఉద్యోగంలో కొంత కాలం ఎస్సైగా చేరి సివిల్ ఎస్సైగా నిజామాబాద్, హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం దక్షిణమండలం, మీర్ చౌక్ డివిజన్‌కు చెందిన డబీర్‌పురా ఠాణాలో అదనపు సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.

- ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్‌కు ఇటీవల అమెరికాలో 2017 ఆగస్టు 7 నుంచి 15 వరకు జరిగిన టెన్నిస్ పోటీలకు ఎంపికైన బోస్ కిరణ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీల్లో మన దేశం నుంచి వెళ్లిన వారిలో తెలంగాణ నుంచి బోస్ కిరణ్, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక డీఎస్పీ, చండీగఢ్ నుంచి ఒక ఎస్సీ తదితరులు ఉన్నారు. ప్రపంచ పోలీస్, ఫైరింగ్ గేమ్స్‌లో టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో కిరణ్ కాంస్య పతకాలను అందుకున్నారు. పతకాలు సాధించి ఇటీవలే నగరానికి వచ్చిన బోస్ కిరణ్‌ను నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి, డబీర్‌పురా పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

### *ప్రముఖ టెన్నిస్ కోచ్ నాగరాజు వద్దే శిక్షణ*

పోలీసు విధుల్లో ఉంటూనే, సమయం దొరికితే తాను ఇప్పటికీ లాల్‌బహదూర్ స్టేడియంలో టెన్నిస్ సాధన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో టెన్నిస్ క్రీడాకారులకు ప్రముఖ శిక్షకుడుగా ఉంటున్న నాగరాజు పర్యవేక్షణలో తన సాధన కొనసాగిస్తున్నట్లు వివరించారు. తండ్రి బ్యాడ్మింటన్ క్రీడాకారుడుగా ఉండడంతో తనకు పదో ఏట నుంచే టెన్నిస్‌పై మక్కువ ఏర్పడిందని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో అంతర్‌జిల్లా, అంతరాష్ట్ర, జాతీయ స్థాయిలో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటూ ఎన్నో పతకాలను సాధించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలనే దీక్షను కొనసాగిసాగిస్తున్నట్లు ఆయన వివరించారు.


## 'కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

ఈనాడు-హైదరాబాద్: కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్‌రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఏడాది కాలంగా వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడాన్ని ఆయన తప్పు పట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదని.. రెసిడెన్షియల్ తరహాలో నడుస్తున్న కేజీబీవీల్లో పనిచేసేవారికి అదనపు పనిచేసినట్లుగా భావించి అదనపు వేతనాలు ఇవ్వాల్సి ఉండగా పనిచేసిన కాలానికే వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. కేజీబీవీల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందనే నెపంతో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులను రెన్యువల్ చేయకుండా సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తామని హెచ్చరిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. ఆంజనేయులు ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గాలయ్య మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సెలవలన్నీ కేజీబీవీ మహిళాల ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

# నమ్మకం పెంచేలా.. భరోసా కల్పించేలా..!




- 'మీ కోసం'పై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్
- ప్రజలకు చేరువ చేసేలా వినూత్న చర్యలు
- 7 రోజుల్లోగా పరిష్కరించాలంటూ ఆదేశాలు
- ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక వ్యవస్థ
- తమ సమస్యలు చెప్పుకునేందుకు బారులు తీరిన ప్రజలు

ఈనాడు, హైదరాబాద్

సామాన్యుడికి కొండంత భరోసా.. కష్టాలను, కన్నీళ్లను తుడిచే బృహత్తర కార్యక్రమం 'మీ కోసం'ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితా రాణా కృషి చేస్తున్నారు.. ఇక్కడికొస్తే చాలూ.. సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకాన్ని ప్రజల్లో పెంచేలా చర్యలు తీసుకొంటున్నారు. అర్జీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- ఒకప్పుడు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో 'మీ కోసం' మొక్కుబడిగా జరిగేది.. ఉన్నతాధికారులే సక్రమంగా హాజరయ్యే వారు కాదు. ప్రజలు గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చేది. తమకు నచ్చినప్పుడు వచ్చేవారు. కొందరైతే కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకునేవారు. అర్జీలను అలా తీసుకొని ఇలా అటకెక్కించేవారు. రెండు, మూడు సార్లు అడిగితేనే బయటకు తీసేవారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసలు ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్నింటిని పరిష్కరించారనే సమగ్ర సమాచారం ఉండేది కాదు.. కొందరైతే ఇంత దూరం పని లేక వచ్చామా అంటూ అధికారులతోనే గొడవలకు దిగేవారు. అయినా.. జిల్లా యంత్రాంగం తీరులో మార్పు రాలేదు. ఇలాంటి తరుణంలోనే జిల్లా కలెక్టర్‌గా డా. యోగితా రాణి బాధ్యతలు స్వీకరించారు.



## ఒక్కొక్కటిగా..!

'మీ కోసం'పై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందన్న విషయాన్ని ఆమె గుర్తించారు. పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రత్యేకంగా ఆర్డీవో స్థాయి అధికారిని నియమించారు. ఏడు రోజుల్లోపు దరఖాస్తులను పరిష్కరించాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. ఏం చర్యలు తీసుకున్నారో ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. ఆపద్బంధు, ఆసరా పింఛన్లకు సంబంధించిన అర్జీలను మూడో రోజుల్లో పరిష్కరించాల్సిందిగా సూచించారు. అవసరమైన పత్రాలను ఆయా మండలాల నుంచి తెప్పించుకోవాల్సిన బాధ్యత సంబంధిత సెక్షన్ ఉద్యోగులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆధార్‌లో చిరునామా మార్పునకు సంబంధించిన పిటిషన్లను 24 గంటల్లో పూర్తి చేయాల్సిందిగా ఈ-డిస్ట్రిక్ అధికారిని ఆదేశించారు.

## 48 గంటల్లోపు..!

దస్త్రాలపై ప్రాధాన్యం, అత్యంత ప్రాధాన్యం అని రాయాలని అత్యంత ప్రాధాన్యం కలిగిన వాటిని 48 గంటల్లోపు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ తీసుకొంటున్న చర్యలతో ప్రజల్లో మీకోసంపై నమ్మకం పెరిగింది. ఎప్పుడూ లేనంతంగా సోమవారం భారీగా హాజరయ్యారు.

## మానవత్వం చాటుకున్నారు...

కలెక్టర్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆసిఫ్‌నగర్ మండలం భోజగుట్ట నివాసి కేశవులు మీ కోసం కార్యక్రమానికి హాజరయ్యారు. ఇంటి నంబర్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లుగా వాపోయారు. కేటాయించేందుకు అధికారులు మా బస్తీని సందర్శించినప్పుడు ఊళ్లో లేమని కలెక్టర్‌కు వివరించారు. వాస్తవానికి ఈ అంశం జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తుంది. అయినా.. ఆ వృద్ధుడి పరిస్థితిని గమనించి జీహెచ్ఎంసీ కార్యాలయానికి తీసుకెళ్లి.. ఇంటి నంబర్ కేటాయించే వరకు అన్నీ దగ్గరుండీ చూసుకునే బాధ్యతను కలెక్టరేట్‌లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. వికలాంగులు, మహిళల దరఖాస్తులను వీలైనంత తొందరగా తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

# వీఎంహోం స్థలాలను రాచకొండ కమిషనరేట్‌కు కేటాయించొద్దు

## రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సరూర్‌నగర్: వీఎంహోం ఖాళీ స్థలాలను విద్యాసంస్థలు, విద్యార్థుల ఉన్నత చదువుల కోసమే ఉపయోగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. సోమవారం కొత్తపేట బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు తెదేపా రంగారెడ్డి జిల్లా కన్వీనర్ సామ రంగారెడ్డి, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. నిజాం కాలం నాటి వీఎం హోం.. ఓ సంస్థగా ఉండి వేలాది మంది నిరుపేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారికి జీవితాలను అందించిందన్నారు. జీఓ నంబర్ 48 విడుదల చేసి రాచకొండ కమిషనరేట్ నిర్మాణం కోసం వీఎం హోంలోని పది ఎకరాలను ఇవ్వడం సబబు కాదన్నారు. గతంలో కొన్ని సంస్థలకు అద్దెకిస్తే ఇప్పటి వరకు కిరాయిలు చెల్లించలేదని ఆరోపించారు. కేసీఆర్ అన్నట్లుగా కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను ఇక్కడ అమలు చేయాలన్నారు. త్వరలో వీఎం హోం పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సీపీఎం జిల్లా కోర్ కమిటీ సభ్యులు చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెదేపా, కాంగ్రెస్ ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు ఆకుల అరవింద్‌కుమార్, పాండు రంగాచారి, చిరంజీవులు, పాపయ్యగౌడ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా దిమ్మెలు కూలిస్తే గద్దెలు కదులుతాయ్

## పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: తెదేపా దిమ్మెలు కూలిస్తే గద్దెలు కదులుతాయని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాపులో కూలిన దిమ్మెను పునరుద్ధరించిన చోట సోమవారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 'నంద్యాలలో గెలుపొందడం ద్వారా అక్కడ డేరాబాబా డేరా కూలిపోయింది.. ఇక ఇక్కడ తెలంగాణలో కేసీఆర్ డేరా కూలే రోజులు కూడా సమీపంలోనే ఉన్నాయి..' అన్నారు. పేదలకు రెండు పడకగదుల ఇళ్లు నిర్మిస్తామన్నారని, ట్యాంక్‌బండ్‌లో మురికి తీసి కొబ్బరినీటిలా మారుస్తామని, ఉస్మానియాను ఆధునికీకరిస్తామని చెప్పిన కేసీఆర్ ఏమయ్యారని ప్రశ్నించారు. దిమ్మెను కూల్చినవారిని అరెస్టుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానని చెప్పిన కృష్ణారావు మూడేళ్లలో ఏం చేశారో చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెదేపా నేత పెద్దిరెడ్డి మాట్లాడుతూ నివురుగప్పిన నిప్పులా ఉన్న పార్టీని తట్టి లేపారన్నారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పద్మచౌదరి, జాస్తి శ్రీధర్, కొడాలి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ ధరలు

| | వెన్‌కాబ్ | సుగుణ |
|---|---|---|
| ఫాంరేటు | 84–00 | 85–00 |
| రిటైల్ | 99–00 | 100–00 |
| డ్రెస్డ్ | 139–00 | 145–00 |
| స్కిన్‌లెస్ | 163–00 | 170–00 |

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121




ప్రమాదమని తెలిసినా.. యువకులు రహదారి అడ్డంగా కూర్చుని ఫొటోలు దిగుతున్నారు. నెక్లెస్‌రోడ్డు లోనిదీ దృశ్యం.

## నగరంలో ఈనాడు

- రవీంద్రభారతిలో ఉదయం 11గంటలకు బంజారా తీజ్ మేళా..పురస్కారాల ప్రదానోత్సవం
- చిక్కడపల్లి త్యాగరాయగానసభలో సాయంత్రం 5గంటలకు 'అంతర్జాతీయ జానపద దినోత్సవం' సందర్భంగా 'జానపద కవి-గాయక సమ్మేళనం'
- బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6గంటలకు తెలుగు వ్యవహారిక బాషోద్యమ పితామహులు, రావు బహద్దూర్ 'గిడుగు రామమూర్తి పంతులు' జయంతి ఉత్సవాలు

# నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

## అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



జీఎస్ శంకర్



నర్సింగ్‌లాల్‌జీ

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా జీఎస్ శంకర్, కార్యదర్శిగా ఎం.నర్సింగ్‌లాల్‌జీ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్, ముఖ్య సలహాదారులు కె.గంగాధర్ ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా శంకర్, నర్సింగ్‌లాల్‌జీ మాట్లాడుతూ. . జిల్లాలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు ఉద్యోగులకు అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

# గిట్టుబాటు ధర కల్పించడంలో కేసీఆర్ విఫలం

## భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

మహేశ్వరం, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేసిన రైతుల చేతులకు సంకెళ్లు వేయించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు ఆరోపించారు. సోమవారం మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన రైతు పంచాయతీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాను కూరగాయల హబ్(జోన్)గా ప్రకటించి విమానాల ద్వారా ఇతర దేశాలకు కూరగాయలను ఎగుమతి చేస్తామన్న కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన ఉత్పత్తులను నగర మార్కెట్‌కు తరలించడానికి కనీసం బస్సు సదుపాయం కల్పించలేని అసమర్థ ప్రభుత్వమన్నారు. రంగారెడ్డి జిల్లాలో రైతులు తమ సమస్యలను తెల్పుకునేందుకు భాజపా జిల్లా కార్యాలయంలో ఓ టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ ప్రధానకార్యదర్శి సుగుణాకర్‌రావు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, భాజపా నాయకులు వజ్జా సుధాకర్‌శర్మ, సుదర్శన్, శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

# ఎస్సీ, ఎస్టీలకు ఉప ప్రణాళిక .. సక్రమంగా అమలు చేయాలని డిమాండ్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: దళిత, గిరిజన ఉప ప్రణాళికను సక్రమంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర దళిత సంఘాల ఐకాస డిమాండ్ చేసింది. ఐకాస 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బషీర్‌బాగ్‌లో రాష్ట్ర స్థాయి దళిత, బహుజన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకాస వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల చంద్రమౌళి, కన్వీనర్ బొజ్జ యాదగిరి, సిద్ధి మల్లేశం, నాగంపెల్లి కనకయ్య, కంపల్లి జగదీశ్వర్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల వృత్తులకు చేయూతనిచ్చేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ.. దళిత వృత్తులను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.